## అభిమానిని కలిసి చలించిపోయిన పవన్



8

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 18 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 164 | పేజీలు: 8+4 | వెల రూ.5

## అంతరిక్ష యాత్రకు ఇండో-అమెరికన్



2

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |



# ఇంటింటికీ యోగా

1.33 లక్షల సెంటర్లలో కోటి మందితో యోగాంధ్ర

20, 21వ తేదీల్లో బాబా రాందేవ్‌తో కలిసి సీఎం యోగా



**(అమరావతి, పి.మీరా హుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ లో సంజీవని కార్యక్రమంతో అనుసంధానం ద్వారా యోగాను రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యోగా డే కార్యక్రమం నిర్వహణపై అధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం నిర్దేశించారు. అత్యుత్త ప్రదర్శన కనపర్చిన యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ప్రత్యేక పురస్కారాలు అందజేయాలని సీఎం సూచించారు. ఇంటింటికీ యోగా ప్రధాన థీమ్గా ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. వివిధ వైద్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక థెరప్యూటిక్ యోగా కార్యక్రమాన్ని ...మిగతా 2లో



## జాతీయ స్విమ్మింగ్‌లో మెరిసిన కనాలిని,వర్షిక..

5

- జాతీయ వేదికపై 'బెజవాడ' జలసంచలనం!
- జాతీయ పారా స్విమ్మింగ్లో విజయవాడ జలకన్యల చారిత్రక రికార్డు!
- 'కనాలిని'కి రజతం, కాంస్యం.. 'ప్రపంచ కప్' రేసుకు అర్హత!

## రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం

2

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పనిచేస్తున్నాం
- మంత్రి టీజీ భరత్ గుప్తా



గాదె సాయికృష్ణ అదృశ్యంపై సీఐ నాగరాజు సస్పెన్షన్ 2

ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
సమీక్షలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

### మోదీ నాయకత్వంలో
## దేదీప్యమానంగా దేశం

**డా. ఏలూరి రామచంద్రారెడ్డి**

**మార్కాపురం, జూన్ 17(మనం న్యూస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మార్కాపురం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన విజయోత్సవ సభ ఘనంగా జరగడం సంతోషకరమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. సభకు హాజరైన జనసందోహాన్ని చూస్తేనే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి విజయాలు, సంక్షేమ కార్యక్రమాలు, ...మిగతా 2లో

## దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యం

జురాంగ్ లేక్ గారెన్స్‌లోని జపనీస్ గార్డెన్ పరిశీలన

సింగపూర్ పర్యటన ముగించుకుని మలేషియాకు బయలుదేరిన మంత్రి 2





### జగన్ ఎన్ని జన్మలెత్తినా...
# డీఎస్సీని ఆపలేరు

2

ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు

గొడ్డలి బ్యాచ్ కు మహిళలను గౌరవించడం తెలియదు

డీఎస్సీపై ఎప్పుడైనా చర్చకు సిద్ధం

విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్



### మహిళా గౌరవం టీడీపీ మహిళలకే...
# పరిమితమా?

కూటమి పాలనలో మనుషుల కంటే మేకపోతే విలువ ఎక్కువా

గతంలో చేసిన వ్యాఖ్యలు మరిచిపోయారా అనితమ్మా

మన వాళ్లకు ఒక న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామలరెడ్డి ధ్వజం

**తాడేపల్లి,జూన్,17,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో మహిళల భద్రత, గౌరవం, ఎన్నికల హామీల అమలు వంటి కీలక అంశాలపై కూటమి ప్రభుత్వాన్ని వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల నిలదీశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ, మహిళా గౌరవం విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. మహిళలపై నేరాలు, వేధింపులు, లాకప్ డెత్ ఆరోపణలు, అదృశ్య ఘటనలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం అసలు సమస్యలను పక్కన పెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. హోంమంత్రి అనిత తన బాధ్యతలను నిర్వర్తిస్తూ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర హోంమంత్రి అనిత మహిళల గౌరవం గురించి మాట్లాడటం చూస్తుంటే దయ్యాలు వేదాలు 2

### సమాచార శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్‌కు
## కలెక్టర్ ఘన సన్మానం

- వెంకటేశ్వర ప్రసాద్ సేవలు అభినందనీయం
- జిల్లా కలెక్టర్ బాలాజీ



2

### సమాచార శాఖ ఆర్జేడీగా తిమ్మప్ప



2

డెడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు గుంటూరు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వక స్వాగతం పలికిన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,డి ఆర్ ఓ షేక్ ఖాజావలి 2





### నేడు ప్రారంభం కానున్న
# ఏక్యూఏఐసీ

- ఐబిఎంతో కలిసి అమరావతి క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్
- 380 క్వాంటం ఇన్నోవేషన్ సెల్స్ ద్వారా అల్గారిథమ్స్, అప్లికేషన్ల అభివృద్ధి
- క్వాంటం అప్లికేషన్ల అభివృద్ధిలో 3వేల మంది ప్రొఫెసర్లు, విద్యార్థులు
- అమరావతి క్వాంటం వ్యాలీలో కీలకం కానున్న ఏక్యూఏఐసీ



**అమరావతి, జూన్ 17,(మనం ప్రత్యేక ప్రతినిధి):** అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా అమరావతి క్వాంటం-ఏఐ ఇన్నోవేషన్ గురువారం ప్రారంభం కానుంది. ఐబీఎం సహకారంతో క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు అవుతోంది. ప్రపంచ స్థాయి క్వాంటం ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ ఏర్పాటు లో భాగంగా ఈ క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ కీలకమైన మైలు రాయిగా నిలవనుంది. 380 క్వాంటం ఇన్నోవేషన్ సెల్స్, 3 వేల మందికి పైగా ప్రొఫెసర్లు, విద్యార్థులు ...మిగతా 2లో

## ప్రజల సంతృప్తే... కూటమి ప్రభుత్వానికి గీటురాయి

మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం,జూన్,17,(మనం న్యూస్): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా 'విద్య'ను ప్రధాన అంశంగా కేటాయించి రాజమహేంద్రవరంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ...వివరాలు 2లో





# క్షేత్రస్థాయిలో పాలనపై దృష్టి పెట్టాలి

అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందే

అధికారులు, ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రిల్లో విశ్లేషణ

ఫిర్యాదులను అర్జీదారులే ట్రాక్ చేసుకునేలా కొత్త వ్యవస్థ

ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**అమరావతి,పి.మీరాహుస్సేన్ ఖాన్,మనం ప్రత్యేక ప్రతినిధి :** ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...పాలనా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు దాటింది. తప్పులు జరగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. లోపాలు ఏమైనా ...మిగతా 2లో

# ఇంటింటికీ యోగా

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ఈసారి యోగా డేకు రాష్ట్రానికి ప్రత్యేక అతిథిగా వస్తున్న ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్తో కలిసి ఈనెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేలు నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే.. ప్రత్యామ్నాయంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్, అదే రోజు ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రికి తెలిపారు. 18వ తేదీ నుంచి 20 వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు అధికారులు వివరించారు. 21వ తేదీన 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగాడెస్టినేషన్' పేరుతో వచ్చే ఏడాది యోగా డే వరకు కేలండర్ ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

### గాదె సాయికృష్ణ అదృశ్యంపై
# సీఐ నాగరాజు సస్పెన్షన్

**అమరావతి, జూన్ 17,(మనం ప్రత్యేక ప్రతినిధి):** విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారంలో సంబంధిత పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సచివాలయంలో సీఎం చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి వచ్చిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. సాయికృష్ణ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశాలు ఇచ్చారు. దీనిపై సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని సీఎం స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు తదితరులు హాజరయ్యారు.

# మహిళా గౌరవం టీడీపీ మహిళలకే పరిమితమా

(మొదటి పేజీ తరువాయి)

వల్లించినట్లుగా ఉంది. గత రెండేళ్లుగా మహిళలను అవమానకరంగా మాట్లాడింది ఎవరు? మాజీ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, వైయస్ఆర్సీపీ మహిళా నాయకులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడింది ఎవరు? ప్రజలకు అన్నీ తెలుసు. అందుకే మీరు గతంలో మాట్లాడిన వ్యాఖ్యల వీడియోలను ఈరోజు ప్రెస్మీట్లో ప్రదర్శించాం. ఒక మహిళా ప్రజాప్రతినిధి హోదాలో ఎంత హుందాగా మాట్లాడాలో ముందుగా మీరు గుర్తుంచుకోవాలి.

**హోంమంత్రి సమాధానం చెప్పాలి**

రాష్ట్రంలో మహిళలపై నేరాలు, వేధింపులు తగ్గాయా? సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ ఆగాయా? ఈ ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం చెప్పాలి. మహిళలకు భద్రత కల్పించడం మీ బాధ్యత. అది చేతకాకపోతే పదవి నుంచి తప్పుకోవాలి. టీడీపీకి చిత్తశుద్ధి ఉంటే గతంలో మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను కూడా ఖండించాలి. మహిళా గౌరవం అందరికీ సమానంగా ఉండాలి. టీడీపీ మహిళలకు ఒక న్యాయం, వైయస్ఆర్సీపీ మహిళలకు మరో న్యాయం ఉండకూడదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 143 హామీల అమలుపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో మనుషుల కంటే మేకప్కే ఎక్కువ విలువ ఉన్నట్లుగా కనిపిస్తోంది. అధికార పార్టీ నేతలపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? హోంమంత్రిగా అందరికీ సమన్యాయం చేయాలని, చట్టం ఎవరికి చుట్టం కాదని నిరూపించాలని డిమాండ్ చేసిన ఆరె శ్యామల, ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పక తప్పదని, వైయస్ఆర్సీపీ ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

### ప్రజల సంతృప్తే
# కూటమి ప్రభుత్వానికి గీటురాయి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులను ప్రజలకు, నాయకులకు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, పారదర్శక పాలన, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తోందన్నారు. విద్యారంగంలో సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల విశేషాలను ప్రతిబింబించే స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో రాక్షస పాలన సాగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు ఒక మంచి సుపరిపాలన అందుతోందని చెప్పుకొచ్చారు. గత సర్కారు అసమర్థ నిర్వాకాలు.. నేటి ప్రభుత్వం సాధిస్తున్న అద్భుత ఫలితాల వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని.. లబ్ధిదారుల ముఖాల్లో ఆ ఆనందం స్పష్టంగా కనిపిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఊహించిన దాని కంటే.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి రెండేళ్లలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపినట్లు తెలిపారు. ముఖ్యంగా దేశంలోనే ఓ విజనరీ ముఖ్యమంత్రిగా పేరుపొందిన నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఈ విభజిత ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళుతోందని చెప్పుకొచ్చారు. ఓవైపు చంద్రబాబు దార్శనికత, మరోవైపు పేదల కోసం పరితపించే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్., ఇంకోవైపు కేంద్రం నుంచి సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు కితాబిచ్చారు.ఇలా పేదలు, విద్యార్థులు, రైతులు, మహిళలు అన్ని వర్గాల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. 2029 నాటికి పేద యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఓ కమిటీని ఏర్పాటు చేయగా.. అందులో తాను ఓ సభ్యుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో నూటికి నూరు శాతం సఫలీకృతమవుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇటువంటి అద్భుత కార్యక్రమాలు చేపడుతున్న కూటమి ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

# రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం

**కర్నూలు జూన్ 17 మనం న్యూస్:** కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బండపురంలో బోద రిత్విక్ వెంచూర్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపా ష్యూర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ యజమానులు మంత్రి, ఎమ్మెల్యేకు ప్లాంట్ గురించి వివరించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ 90 రోజుల్లో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 150 మందికి, పరోక్షంగా 200 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలుచేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. రిలయన్స్ కంపెనీ రాష్ట్రానికి రావడంతో దానికి అనుబంధంగా చాలా యూనిట్స్ ఏర్పాటవుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ స్థానికంగా ఇలాంటి కంపెనీలు రావడం సంతోషంగా ఉందన్నారు. పెట్టుబడిదారులకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. ప్లాంటును మరింత విస్తరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా దూసుకువెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధులు ఆర్పన్ బసు, ప్రథమేష్ మెహ్తా, రాకేష్శర్మ, ఎం.డి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యం

**అమరావతి/సింగపూర్,జూన్ 17,(మనం ప్రత్యేక ప్రతినిధి):** అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఆధునిక పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో సింగపూర్లో పర్యటిస్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అక్కడ అమలవుతున్న అత్యాధునిక విధానాలను అధ్యయనం చేశారు. పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ సింగపూర్లోని మెరీనా బే శాండ్స్లో ఉన్న సింగపూర్ నేషనల్ ఎన్విరాన్మెంట్ ఏజెన్సీ (ఎన్ఈఏ) కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్ఈఏ డైరెక్టర్ కోలిన్ గూతో సమావేశమైన మంత్రి, పర్యావరణ పరిరక్షణ, నగర పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యంతో అమలవుతున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.

తదుపరి మంత్రి నారాయణ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్తో కలిసి తువాస్ సౌత్ ఇన్సినరేషన్ ప్లాంట్ను సందర్శించారు. సింగపూర్లోని అతిపెద్ద వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్గా ఉన్న ఈ కేంద్రంలో ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ ప్రమాణాల అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణలో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన మంత్రి, రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో వాటి అమలు అవకాశాలపై అధికారులతో అభిప్రాయాలు పంచుకున్నారు.

# జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరు

**తాడేపల్లి, జూన్ 17, మనం న్యూస్ః** తాడేపల్లి లోని ప్రాతూరు రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శంకుస్థాపన చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 2019లో 5,300 ఓట్ల తేడాతో మంగళగిరిలో నేను ఓడిపోయాను. మొదటి రోజు బాధ, ఆవేదన కలిగింది. రెండో రోజు ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఊరూరా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నా. 2024 ఎన్నికల్లో 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే కొండంత బలం వస్తుందని చెప్పాను. నా కోరికను మన్నించి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీతో గెలిపించారు. నాపై ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. గెలిచిన మొదటిరోజు నుంచే మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ పవర్ మొత్తం మంగళగిరి నియోజకవర్గానికి ఏర్పాటుచేస్తున్నాం. దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ప్రారంభించాం. లైబ్రరీలకు పూర్వవైభవం తీసుకువస్తున్నాం. మంగళగిరి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. పార్క్ లు, లేక్ లు, కమ్యూనిటీ భవనాలు, చివరకు శ్మశానాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతారెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వృద్ధులకు రూ.4వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేలు, ప్రతిఏడాది ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉన్నా ఆర్థికసాయం అందిస్తున్నాం. మత్స్యకార సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ కింద కేంద్రం, రాష్ట్రం కలిసి రూ.20వేలు అందిస్తున్నాం. ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. పులివెందుల ఎమ్మెల్యే బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి. బెంగళూరులో మూడు రోజులు, తాడేపల్లిలో ఒకరోజు, హైదరాబాద్ లో మూడు రోజులు ఆయన నివసిస్తారు. అందుకే ఆయన బెంతాపై. ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదుఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు. ఓటు నమోదు పకడ్బందీగా చేయాలనేది మా లక్ష్యం. కావాలనే మాపై ఆరోపణలు చేస్తున్నారు. పబ్లిక్ లో ఉన్న డేటానే మా వద్ద కూడా ఉంది. వైసీపీకి ఐటీలో అవగాహన లేదుకాబట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారు. ఒక యాప్ తయారుచేసి మా కార్యకర్తలకు సులభతరం చేశాం. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంటుంది. ప్రిజనరీ ఎప్పుడూ జైలు వైపు చూస్తాడు. ఆయన చుట్టూ ఎప్పుడూ రౌడీలు ఉంటారు. మహిళలను కించపరిచే వారు ఉంటారు. విజనరీ ఎప్పుడూ ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయి. ఇందుకు బ్రాండ్ సీబీఎన్ కారణం. 76 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు గారు ఆయనే కొబ్బరికాయ తీసుకుని కొడతారు. సైకిల్ తొక్కుతారు. పులివెందుల ఎమ్మెల్యే అదికూడా చేయలేరు. గొడ్డలి బ్యాచ్ కు మహిళలను గౌరవించడం తెలియదుఇండస్ట్రీకి, కోడిగుడ్డుకు తేడా తెలియని వ్యక్తి ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు. ఉన్న పరిశ్రమలు తరిమేశారు. హోంమంత్రి అనితపై కోడిగుడ్డు మంత్రిగా పనిచేసిన వ్యక్తి కించపరిచేలా మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు చాలా బాధాకరం. గుడివాడ అమర్ నాథ్ ను చాలా బాగా చేశావని జగన్ రెడ్డి పొగిడారంట. అసలు వీరు ఎక్కడికి పోతున్నారు? ఇదేవిధంగా భారతిరెడ్డి గారి గురించి, మీ ఇద్దరు కూతుళ్ల గురించి మాట్లాడితే సమర్థిస్తారా? ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం? అధికారంలో ఉన్నప్పుడు మా తల్లిని అవమానించారు. బ్రాహ్మణిని అవమానించారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మా కార్యకర్త పొరపాటున భారతిరెడ్డి గారి గురించి మాట్లాడితే.. క్షమాపణే కాదు.. అతడిని జ్యూడిషియల్ రిమాండ్ కు పంపిన ఘనత ప్రజాప్రభుత్వానిది. అదీ మహిళల పట్ల మా గౌరవానికి నిదర్శనం. గొడ్డలి బ్యాచ్ కు మహిళలను గౌరవించడం తెలియదు. జగన్ లో జీ అంటే గొడ్డలి. ఒక్క ఎగ్జిట్ కూడా రాజధానికి ఉండకూడదనే దుర్బుద్ధితో వ్యవహరించారు. జగన్ కు అమరావతిపై కక్ష ఉంది. అవసరమైన మేరకు తాము ఎగ్జిట్ లు ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు.

## సమాచార శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్‌కు కలెక్టర్ ఘన సన్మానం

**మచిలీపట్నం జూన్ 17,(మనం న్యూస్):** జిల్లాలో ప్రభుత్వ పథకాలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్ ఎంతగానో కృషి చేశారని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు. సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ యమ్. వెంకటేశ్వర ప్రసాద్ కు జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి లభించిన నేపథ్యంలో బుధవారం నగరంలోని గాంధీనగర్ వాకర్స్ అసోసియేషన్ హాలులో ఏపీ యోగాసభ ఆధ్వర్యంలో నిత్య యోగ సాధన అనంతరం వెంకటేశ్వర ప్రసాద్ ను కలెక్టర్ డికె బాలాజీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటేశ్వర ప్రసాద్ సమయపాలన పాటిస్తు, క్రమశిక్షణ తో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలందరికీ తెలియజేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు.

జిఅన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో తనకు వెన్నుదన్నుగా నిలిచి విశిష్ట సేవలు అందించారన్నారు. ఎపి యోగ సభ తరపున చేస్తున్న యోగా కార్యక్రమాలలో వెంకటేశ్వర ప్రసాద్ స్వయంగా పాల్గొంటూ ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రాచుర్యం కల్పించారని , తద్వారా ప్రజలకు యోగా పట్ల మంచి అవగాహన కల్పించేందుకు అవిరళ కృషి చేశారని, వారు చేసిన సేవలు మరువలేనివని, పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం సమాచార శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో దాదాపు 2 సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నానని, తనకు ఆరోగ్యంతో పాటు ఒత్తిడి లేకుండా మానసిక ప్రశాంతత లభించడంతో ఉద్యోగ విధులు సజావుగా నిర్వహించగలుగుతున్నానని, అందులకు జిల్లా కలెక్టర్కు, ఉచితంగా యోగ నేర్పిస్తున్న గురువులకు ధన్యవాదాలు తెలిపారు.

## సమాచార శాఖ ఆర్జేడీగా తిమ్మప్ప

**(అమరావతి, పి.మీరా హుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** సమాచార పౌర సంబంధాల శాఖ జోన్-2, విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా (రీజినల్ జాయింట్ డైరెక్టర్) పి. తిమ్మప్ప బుధవారం అధికారికంగా సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లోని కమిషనరేట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా, శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, తోటి అధికారులు, కార్యాలయ సిబ్బంది, జోన్ -2 పరిధిలోని డి.ఐ.పి.ఆర్.ఓ లు , డిప్యూటీ డైరెక్టర్లు, డీఈ లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఏఈ లు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారుల (డీఐపీఆర్వోలు) , పిఆర్వోలు , ఇంజనీరింగ్ సిబ్బంది సహకారం, సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మీడియా సమన్వయంతో ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరేలా సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల ప్రచారాన్ని మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువయ్యేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని పి. తిమ్మప్ప తెలియజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లో జర్నలిజం లో పీజీ పూర్తి చేసి ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా 1996 లో సమాచార శాఖ పిఆర్వో గా చేరిన తరువాత 30 సంవత్సరాల సర్వీసులో అనంతపురం, కడప, కర్నూలు, తిరుపతి, తిరుమల, చిత్తూరు, హైదరాబాద్ సెక్రటేరియట్ లో పనిచేసారు. సమాచార శాఖ మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథరెడ్డి ఓఎస్డీ గా, సమాచార శాఖ కమిషనరేట్, కాకినాడ ఐ అండ్ పీ ఆర్ డీడీ గా పలు హోదాల్లో పనిచేయడంతోపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి ఉత్తమ అధికారిగా, 15 సార్లు ఉత్తమ అధికారిగా వివిధ కలెక్టర్ల నుంచి అవార్డులు పొంది, ఇటీవల జేడీ గా ప్రభుత్వ ఉత్తర్వులతో పదోన్నతి, పోస్టింగ్ ఆర్డర్స్ తో ఆర్ జె డి జోన్ -2 గా ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని 8 జిల్లాలకు సమాచార శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ అధికారులతో, సిబ్బందితో సమావేశమై, ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, పెండింగ్లో ఉన్న పనులు, శాఖా పరమైన ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించి, సమన్వయంతో పనిచేసి శాఖ పనితీరును మరింత మెరుగుపర్చాలని పి. తిమ్మప్ప సూచించారు.

# క్షేత్రస్థాయిలో పాలనపై దృష్టి పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటే వాటిని ఏ విధంగా సరి చేయాలనే అంశం మీద ఫోకస్ పెట్టాను. అధికారులు, ఉద్యోగులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలి. ప్రజలకు సేవలు అందించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలి. ఫీల్డులోని సమస్యలను స్వయంగా పరిశీలిస్తే అధికార యంత్రాంగం మీద ప్రజల్లో మరింత నమ్మకాన్ని పొందగలం. తనిఖీలు చేస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు మొదలకుని క్షేత్రస్థాయి అధికారి వరకు అందరూ పని చేయాలి. జూలై నెల నుంచి ప్రతి అధికారి ఫీల్డుకు వెళ్లాల్సిందే. వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే చెప్పాం. దాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని సూచించాం. దాన్ని పక్కాగా అమలు చేయాలి. అలాగే నియోజకవర్గాల నోడల్ అధికారులు నెలలో ఒకే మండలాన్ని నాలుగు సార్లు సందర్శించాలి. అధికారులు, ఉద్యోగుల పనితీరు మీద 360 డిగ్రీల్లో విశ్లేషిస్తాం.అని ముఖ్యమంత్రి చెప్పారు. దేవాలయాల్లో భక్తులకు మరింత సేవలు అందించేలా దేవదాయ శాఖ మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం కన్పిస్తోంది. దేవదాయ శాఖ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలి. అన్ని శాఖల్లోని ఉద్యోగుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ మేరకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇప్పించాలి.

పరిపాలనలో సింగపూర్ దేశం వినూత్న విధానాలను అవలంభిస్తోంది. పరిపాలన విషయంలో ఆ దేశ విధానాలను పరిశీలించాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తంగా 11,600 గుంతలు ఉన్నట్టు గుర్తించాం. వీటిల్లో 79 శాతం గుంతలను



పూడ్చాం. మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలి. ముఖ్యంగా అర్బన్-రూరల్ కనెక్టివిటీ రోడ్లల్లో మరమ్మత్తులు త్వరగా చేపట్టాలి. అలాగే రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు సంబంధించి ఆర్ అండ్ బి మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలి.అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**గవర్నెన్స్‌కు టెక్నాలజీ అనుసంధానం... కలిసి పని చేసేందుకు గూగుల్ అంగీకారం**

డేటా డ్రివెన్ గవర్నెన్సులో గూగుల్ మనతో కలిసి పని చేయడానికి అంగీకరించింది. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే గూగుల్ తో కలిసి పని చేస్తోంది. ఆ దిశగా మిగిలిన శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పీజీఆర్ఎస్ లో ప్రజలిచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ మేరకు అర్జీదారులే స్వయంగా వారి అర్జీలను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలి.

తామిచ్చిన ఫిర్యాదు ఏ మేరకు పరిష్కారమవుతోందోననే అంశాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా ట్రాకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంలో దేదీప్యమానంగా దేశం



(మొదటి పేజీ తరువాయి)

ప్రజాహిత నిర్ణయాలు మరియు రాష్ట్ర ప్రగతి కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు చెప్పారు. పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి దిశగా వేగంగా అడుగులు వేయడం, మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలనే ప్రజల ఆకాంక్షను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం వంటి అంశాలు ఈ ప్రాంత అభివృద్ధికి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని అన్నారు. అలాగే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, జాతీయ రహదారుల నిర్మాణం, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని దేశం దేదీప్యమానంగా వెలిగిపోతుందని తెలిపారు.

### నేడు ప్రారంభం కానున్న
# ఏక్యూఏఐసీ

(మొదటి పేజీ తరువాయి)

రియల్ టైమ్ క్వాంటం అప్లికేషన్లు, అల్గారిథమ్ల అభివృద్ధికి తోడ్పాటును అందించేలా ఈ సెంటర్ ఏర్పాటు అవుతోంది. పారిశ్రామిక, విద్యారంగంలోని అంతర్జాతీయ సాంకేతిక నైపుణ్యాన్ని అనుసంధానించే వేదికగా ఈ అమరావతి క్వాంటం -ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ను రూపొందించారు. వివిధ రంగాలకు సంబంధించి ప్రాక్టికల్ క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్లు, అల్గారిథమ్ల అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ సెంటర్ పనిచేయనుంది.

పారిశ్రామిక, విద్యారంగం, సాంకేతిక రంగం నుంచి నిపుణులు అధునాతన కంప్యుటేషనల్ స్కిల్స్ తో వివిధ సమస్యల పరిష్కారం కోసం క్వాంటం అప్లికేషన్లను అమరావతి క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా అభివృద్ధి చేయనున్నారు. పరిశోధన, అభ్యాసం, ఆవిష్కరణలకు తోడ్పాటు అందించేలా ఐబీఎం క్వాంటం ఎకోసిస్టమ్ను అందుబాటులోకి తీసుకురానుంది. ఏక్యూఏఐసీ కోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లోని 380 క్వాంటం ఇన్నోవేషన్ సెల్స్ నెట్వర్క్ ను ఏర్పాటు చేశారు. ఈ నెట్వర్క్ లో భాగంగా 3 వేల మంది ప్రొఫెసర్లు, విద్యార్థులు కలిసి ఇన్నోవేషన్ ఇంజిన్ గా పనిచేస్తూ క్వాంటం అప్లికేషన్లు, అల్గారిథమ్స్ ను రూపొందించనున్నారు. తయారీ, లాజిస్టిక్స్, వైద్యారోగ్యం, ఆర్థిక సేవలు, ఇంధనం, వ్యవసాయం, ప్రజా సేవల రంగాల్లో క్వాంటం అప్లికేషన్ల అభివృద్ధికి ఈ సెంటర్ తోడ్పాటు అందించనుంది. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన పరిశోధన, డీప్ టెక్ లాంటి అంశాల్లో అమరావతి క్వాంటం వ్యాలీని అంతర్జాతీయస్థాయిలో నిలబెట్టేలా ఈ ఏక్యూఏఐసీ ఏర్పాటు కీలక ముందడుగు కానుంది.

# అంతరిక్ష యాత్రకు ఇండో-అమెరికన్

**వాషింగ్టన్,జూన్ 17:** ఇండో-అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్నారు. అనిల్ జులై 14న ప్రారంభం కానున్న అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు ఆయన మరో ఇద్దరు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాతో కలిసి వెళ్లనున్నారు. వారు 240 రోజుల పాటు కక్ష్యలో గడపనున్నారు. జూన్ 22న అనిల్ మేనన్ ఇంటర్వ్యూలు ఇస్తారని నాసా వెల్లడించింది.

భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన అనిల్.. అమెరికా పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు.

అంతకుముందు హార్వర్డ్ నుంచి న్యూరోబయాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెడికల్లలో మాస్టర్ డిగ్రీలను అందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఈయన వ్యోమగామిగానే కాకుండా ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజీషియన్, మెకానికల్ ఇంజినీర్, అమెరికా స్పేస్‌ఫోర్స్ కర్నల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వ్యోమగామి కాకముందు అనిల్ నాసా ఎక్స్‌పెడిషన్ ఫ్లైట్ సరన్‌గా పనిచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములకు సహకరించేవారు. 2021లో నాసా తన వ్యోమగాముల బందంలో అనిల్ను ఎంపిక చేసింది. రెండేళ్ల శిక్షణ తర్వాత 2024లో ఆయన వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. నాటినుంచి కక్ష్యలోకి తన మొదటి అంతరిక్ష యాత్ర కోసం సిద్ధమవుతున్నారు.

## డెడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు గుంటూరు కలెక్టరేట్లో మర్యాద పూర్వక స్వాగతం పలికిన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,డి ఆర్ ఓ షేక్ ఖాజావలి

**గుంటూరు జూన్ 17 (మనం న్యూస్ ప్రతినిధి):** స్థానిక సంస్థలలో బి సి రిజర్వేషన్ల పై అధ్యయనం చేసే డెడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా కు గుంటూరు కలెక్టరేట్లో మర్యాద పూర్వక స్వాగతం పలికిన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,డి ఆర్ ఓ షేక్ ఖాజావలి.కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్ లో వివిధ వర్గాల ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న డెడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వివిధ వర్గాల నుంచి అందిన వినతులు,సూచనలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపిన చైర్మన్ .హాజరైన జిల్లా బి సి వెల్ఫేర్ అధికారి మయూరి, జడ్పీ సీఈవో జ్యోతి బసు, ఇతర అధికారులు.



## శ్రీకాళహస్తి సబ్ డివిజన్లో ప్రత్యేక కార్యక్రమాలు

- శ్రీకాళహస్తి డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలు 70 మందికి మాదకద్రవ్యాల వినియోగ నిర్ధారణ పరీక్షలు

**శ్రీకాళహస్తి, జూన్ 17 మనం న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పీ విడుదల చేసిన కార్యాచరణ ప్రణాళిక మేరకు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఈగల్ సీఐ జి. ప్రసాద్ పోలీసు సిబ్బందిపాల్గొన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా అవగాహన, తనిఖీలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి టూ టౌన్, తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో మొత్తం 70 మందికి డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరికి మాదకద్రవ్యాల వినియోగం పాజిటివ్గా నిర్ధారణ అయింది. వారికి డ్రగ్ అబ్యూస్ ప్రివెన్షన్ (డీఏపీ) సిబ్బంది ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి, వారి పూర్తి వివరాలను నమోదు చేశారు.

## శక్తి యాప్ ప్రాముఖ్యతలపై అవగాహన



**చిత్తూరు జూన్ 17 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు శక్తి టీం నోడల్ అధికారి నాన్ కేడర్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో శక్తి బృందాలు మరియు మహిళా స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో మహిళ స్టేషన్ ఎస్.ఐ. సుబ్బారెడ్డి ఈరోజు చిత్తూరు పట్టణములోని కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ గారు మాట్లాడుతూ, బాల్యవివాహం ఒక పెద్ద సమస్య. బాలికలు 18 సంవత్సరాలు పూర్తిచేయక ముందే పెళ్లి జరపడం చట్ట విరుద్ధం. చిన్న వయసులో పెళ్లి చేస్తే చదువు ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు రావడం, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే మీరు చదువులో ముందుకు వెళ్లి, జీవితాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవాలి. పోక్సో చట్టం చాలా కఠినమైనది. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే దానికి కఠినమైన శిక్షలు ఉంటాయి. ఇలాంటి సంఘటన ఎప్పుడైనా ఎదురైతే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలి. అత్యవసర పరిస్థితుల్లో 112 (ఎమర్జెన్సీ నంబర్), 1098 (చైల్ హెల్ప్లైన్), వంటి హెల్ప్లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలి. ఇవి మీకు వెంటనే సహాయం అందిస్తాయి.బాలికల కోసం ప్రభుత్వం అందించిన శక్తియాప్ చాలాఉపయోగకరమైనది. ఎటువంటి ప్రమాదం ఎదురైనా ఆ యాప్లో సులభంగా పోలీసులకు సమాచారం ఇవ్వగలరు. మీ భద్రత కోసం తప్పనిసరిగా ఈ యాప్ ఉపయోగించాలి. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే (ఎస్ఓఎస్) బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం చేరుతుంది. ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయడం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనమని పేర్కొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ రైతు పొలాన్ని సందర్శించిన కలెక్టర్



**తిరుపతి, జూన్ 17 మనం న్యూస్:** ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించే ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సూచించారు.బుధవారం శ్రీకాళహస్తి మండలం వేడం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ఎ. పుష్ప కు చెందిన మూడు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన విత్తన గుళికల తయారీ విధానం, దాని ప్రయోజనాలు, తయారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బూడిద మరియు విత్తనాలను కలిపి విత్తన గుళికలను తయారు చేశారు. అనంతరం రైతు పుష్ప పొలంలో విత్తన గుళికలను బ్రాడ్కాస్టింగ్ పద్ధతిలో చల్లి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు పుష్పతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ పశుగ్రాసం లభ్యత, నేల సారం పెంపు, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి వ్యయాల తగ్గింపు, రైతులకు కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాల పై ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటునిస్తుందని పేర్కొన్నారు. అనంతరం యూరియా పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఎపిఎఐయంఎస్ మొబైల్ యాప్ను డౌన్లోడ్ చేసుకొని ఎరువుల నిల్వల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అవసరమైన యూరియాను ముందస్తుగా యాప్ ద్వారా బుక్ చేసుకోవడం ద్వారా సమీప ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉన్న ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా అదనపు వ్యవసాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఏ.డి.ఏ. రమేష్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు సూర్యప్రకాశ్ రెడ్డి, వ్యవసాయ అధికారి మమత, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇన్చార్జీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు



**రైల్వే కోడూరు జూన్ 17మనం న్యూస్:** తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, వేగవంతమైన పోలీసు సేవలను అందించాలనే లక్ష్యంతో పుల్లంపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిపాలనా విధానాలు, ప్రజలకు అందించనున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, తిరుపతి జిల్లా పునర్విభజన అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని రెండు సర్కిల్ కార్యాలయాలు కూడా రైల్వే కోడూరు పట్టణంలోనే కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో రైల్వే కోడూరు రూరల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి మండలాల ప్రజలు పిటిషన్లు, పరిపాలనా అవసరాల కోసం రైల్వే కోడూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ప్రజల సౌకర్యార్థం పుల్లంపేట మండల కేంద్రంలో రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి (శాంతిభద్రతలు), ఏ. శ్రీనివాసరావు (క్రైమ్స్), రేణిగుంట సబ్ డివిజన్ అధికారి శ్రీనివాస రావు ఎస్బీ ఇన్స్పెక్టర్ విక్రమ్, పుల్లంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోడూరు టౌన్ సీఐ చంద్రశేఖర్, రేణిగుంట, గాజులమండ్యం సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ అందుబాటులో ఉండడంతో పాటు, సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి, చిట్వేల్ పోలీస్ స్టేషన్ల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఫలితంగా ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావడంతో పాటు, ఫిర్యాదుల స్వీకరణ, విచారణ, సమస్యల పరిష్కారం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన మరింత వేగవంతం అవుతుందని తెలిపారు.

## పాలచూరు క్యాస్కేడింగ్ సిస్టమ్లో జరుగుతున్న పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నాయుడుపేట, జూన్ 17 (మనం న్యూస్):** వర్షపు నీటిని ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడమే జల ధార - జల హారతి లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వేంకటేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార - జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో కలిసి నాయుడుపేట మండలంలోని పాలచూరు క్యాస్కేడింగ్ సిస్టమ్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాలచూరు సిస్టమ్లో స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతానికి అనుసంధానంగా సుమారు 23 కిలోమీటర్ల మేర విస్తరించిన 12 చెరువులు ఉన్నాయని, ఈ చెరువుల ద్వారా సుమారు 6,000 ఎకరాల ఆయకట్టు సాగునీటి సౌకర్యాన్ని పొందుతోందన్నారు. జలధార - జలహారతి కార్యక్రమం ద్వారా ఇరిగేషన్ శాఖ చేపడుతున్న పనులకు ఎన్ ఆర్ ఈ జి ఎస్ పనులను అనుసంధానం చేస్తూ సమన్వయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డ్వామా పిడి మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ఇ రాధాకృష్ణ, ఏపిఐఐసి జెడ్ ఎం.భరత్ కుమార్ రెడ్డి, నాయుడుపేట ఆర్ అండ్ బి డిఈ పరమేశ్వరి, నాయుడు పేట తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ రాజేంద్ర, ఇరిగేషన్ ఇఇ బాబు, డిఇ విశ్వనాథ్, ఏఇ శ్రీనివాసులు, ఏపిఓ ఎన్ఆర్ఈజిఎస్ ఎం.భానుప్రియ, జేఇ నాగభూషణం, అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ సేవలపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత

**చిత్తూరు, జూన్ 17 మనం న్యూస్:** బాలల హక్కులు, సంక్షేమం కోసం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందని కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత పేర్కొన్నారు, చిత్తూరు జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యురాలు బుధవారం చిత్తూరు పట్టణంలో పర్యటించి పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో అందుతున్న సేవలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలు, సంరక్షణ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఆమె, విద్యార్థినులకు అందుతున్న విద్యా, వసతి మరియు ఇతర సౌకర్యాలను పరిశీలించారు..ఈ కార్యక్రమంలో. డి వెంకటేశ్వరి పిడి ఐసిడిఎస్, నిర్మల జిల్లా మిషన్ కోఆర్డినేటర్, సుబ్రహ్మణ్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, సంస్థల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ పై చేస్తున్న ఆరోపణలను తిప్పి కొడదాం

- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**కుప్పం, జూన్ 17 మనం న్యూస్:** ప్రజా సంక్షేమాన్ని కోరి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను ప్రజలకు తెలియజేసి, 2029 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి ఎన్ డి ఏ సర్కార్ ను అధికారంలోకి తెచ్చుకునేందుకు మన మంతా ఐక్యంగా పనిచేద్దామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. అదేసమయంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన 2025 మెగా డీఎస్సీ పై వైకాపా చేస్తున్న విమర్శలను తిప్పుకొట్టాలని ఆయన సూచించారు. బుధవారం కుప్పం ఏపీఎస్ఆర్టీసీ సమీపంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు సంబంధించి, సంక్షేమ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ విజయోత్సవ సభ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా ఆయన , ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మహిళా నేతలు,కుప్పం నియోజకవర్గానికి సంబంధించిన కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు. జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా



చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రెండేళ్ల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా టిటిడి, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ విజయోత్సవ సభా కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ మెంబర్ రాజ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

## తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.6 కంటే తక్కువ ధర చెల్లిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి, జూన్ 17మనం న్యూస్:** జిల్లాలో తోతాపురి మామిడి కొనుగోలు ప్రక్రియలు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డితో కలిసి రేణిగుంట మండలంలోని వర్ష ప్రాసెసింగ్ యూనిట్ను సందర్శించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలు, ధరల అమలు, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది అధిక దిగుబడి కారణంగా రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని



ప్రభుత్వం రైతులకు మద్దతు కల్పించిందన్నారు. ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పటికీ, రైతులకు కిలోకు రూ.6 కంటే తక్కువ ధర రాకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా రైతులతో సమావేశమై వారికి భరోసా కల్పించారని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు.రానున్న 10 నుండి 15 రోజులు తోతాపురి సీజన్లో అత్యంత కీలకమైన కాలమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పక్వానికి రాని కాయలను కోయకుండా, పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి విక్రయించాలని సూచించారు. పక్వానికి రాని కాయలను విక్రయించడం వల్ల రైతులకే నష్టం కలుగుతుందని వివరించారు. ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రైతులు, రవాణా వాహనాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా టోకెన్ విధానాన్ని అమలు చేయాలని అన్ని యూనిట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## విజిలెన్స్, సెక్యూరిటీల అవగాహన సమావేశం



**తిరుమల జూన్ 17 మనం న్యూస్:** తిరుమలలో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడం, క్షేత్ర పవిత్రతను పరిరక్షించడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం మరియు వ్యాపార కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం లక్ష్యంగా పోలీసు, విజిలెన్స్ మరియు సెక్యూరిటీ శాఖల ఆధ్వర్యంలో స్థానిక దుకాణాల యజమానులతో అవగాహన సమావేశం తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించబడింది.ఈ సమావేశంలో దుకాణాల యజమానులకు ధరల ప్రదర్శన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయడం, అనుమతి లేకుండా దుకాణాలను సబ్-లీజ్కు ఇవ్వకపోవడం, లైసెన్స్ లేని హాకర్లను ప్రోత్సహించకపోవడం, నిషేధిత లేదా అనుమతి లేని వస్తువుల విక్రయాన్ని నివారించడం, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం, అనుమతించిన పరిమితికి మించి నిల్వలను ఉంచకపోవడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడింది.

అదేవిధంగా, దుకాణాల్లో పనిచేసే సిబ్బంది పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు నిరంతరం అందించడం, వారి నేపథ్యం మరియు నేర చరిత్రను పరిశీలించిన అనంతరం మాత్రమే నియామకాలు చేపట్టడం, ఎన్యూమరేషన్ డేటాను సకాలంలో సమర్పించడం, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ఎటువంటి వివాదాస్పద పరిస్థితులకు తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేయబడ్డాయి.ఈ సమావేశం తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ ఐ. రామకృష్ణ మార్గదర్శకత్వంలో, తిరుమల డీఎస్పీవిజయశేఖర్ టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన వీజీవో సురేంద్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది దుకాణాల యజమానులతో పాటు తిరుమల వన్ టౌన్, టూ టౌన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, సెక్టార్-3 సెక్టార్-4 ఏవీఎస్వోలు, పోలీసు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.తిరుమలలో శాంతిభద్రతలు, భద్రతా ప్రమాణాలు, క్షేత్ర పవిత్రత భక్తుల సంక్షేమ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

**తిరుపతి జూన్ 17 మనం న్యూస్:** ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరంలో కుళ్ళిపోయిన మాంసం, నాసిరకం ఆహార పదార్థాల విక్రయం ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్



చేశాయి. తిరుపతి నగరంలోని యశోదానగర్లో గల సిపిఎం కార్యాలయంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు వక్తలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశం సిపిఎం నగర కార్యదర్శి కె. వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది.సమావేశంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సి పి యం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు,సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పి. వెంకటరత్నం, స్థానిక హక్కుల పోరాట కమిటీ కన్వీనర్ డి.ఎం.సి. భాస్కర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రజల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం వంటి అత్యంత కీలకమైన అంశాలు పక్కనపెట్టి అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి బండి చలపతి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. జయచంద్ర, ఆర్. లక్ష్మీ, పి. బుజ్జి, ఎం. నరేంద్ర, ఎం. జయంతి, టి. రామకృష్ణ, డి. పార్థసారథి, ఎన్. మునిరత్నం, జి. వాసు, మునిరాజా, ఈ. సుజాతమ్మ, వీరేష్, వినోద్, పవిత్ర, పద్మ, షకీలా, ప్రసూన పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఉత్తమ మార్గం

### జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు



**చంద్రగిరి జూన్ 17 మనం న్యూస్:** ఆరోగ్యవంతమైన జీవితానికి యోగ ఉత్తమ మార్గమని ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో యోగా ను భాగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ లు తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా పరిధి లోని చంద్రగిరి కోటలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆధర్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నా ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలు ఆసక్తిగా ఉంటూ ప్రజలు, అధికారులు ఆసనాలు వేయడం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ జూన్ 21 వ తేదీన జరుపుకోవడం జరుగుతుందని అందులో భాగంగా జూన్ 7 వ తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు గ్రామ, సచివాలయ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వివిధ రకాల పోటీలనునిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. జూన్ 7వ తేదీన జూ పార్కు నందు పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈసారి రాష్ట్రంలో ఎక్కడికక్కడ యోగ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై యోగాసనాలు నిర్వహించారు.

## భ్రమల్లో బ్రతుకులు.!

అన్నీ నాలిక దగ్గరగా వచ్చి
అర్థాంతరంగా ఆగిపోతున్నాయి
అన్నీ ముందుకు నడిచినట్టే
వెనకబడిపోతున్నాయి
అన్నింటిలోనూ సరితూగుతూనే
కాలానికి రెక్కలొచ్చేస్తున్నాయి

ప్రతిదీ అర్హతకు అతుక్కున్నట్టు
భ్రమల్లోకి నెట్టబడుతూనే
ఆశల తివాచీపై నడిచినట్టు
ప్రతి పథకం ఊరిస్తుంది
గాలి దీపాల వెలుతురులో
జీవనం సర్దుకుంటూనే
చీకటితో చేయి కలపాల్సి వస్తుంది

అన్నీ అందినట్టే అందుతూ
ఏదో ఒక వైఫల్యంతో
నీరుగారిపోతూ కనిపిస్తాయి
గాలి విసురు మాటల కోటలో
చిరు దీపపు తండ్లాటలో
ఏన్నో కోరికల ముళ్ళు మధ్య
బ్రతకడమే సాహసమైపోయింది


ప్రతిదీ హత్తుకున్నట్టే
ప్రతి భరోసా తలుపు తట్టినట్టే
అగుపిస్తూ మురిపిస్తాది
తెల్లవారితే కల చెదిరిపోయినట్టు
వాగ్దానపు తెరలు తొలిగిపోతాయి
గందరగోళపు సమయాలతో
రోజూవారి జీవన సంద్రంలో
మునకలేయడమే పనైపోయింది

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి
– ఎడిటర్

# 'సర్' ప్రజాస్వామ్య శుద్ధికా? రాజకీయ లబ్ధికా?




భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంపూర్ణమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉంటే ప్రజాస్వామ్య పునాదులు అంతగా బలపడతాయి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం' (ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర రాజకీయ చర్చకు, మేధోమథనానికి దారితీసింది. అధికారికంగా ఇది ఓటరు జాబితాల్లోని దీర్ఘకాలిక లోపాలను సరిచేయడం, నకిలీ, అర్హతలేని ఓటర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడిని జాబితాలో చేర్చడం కోసం తలపెట్టిన బృహత్తర సంస్కరణగా ఎన్నికల సంఘం పేర్కొంటోంది. ప్రతిపక్షాలు మాత్రం దీనిని ఎన్నికల ముంగిట అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా, ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లను గైర్హాజరు చేసేందుకు ఉద్దేశించిన రాజకీయ ప్రేరిత చర్యగా విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ సాధ్యాసాధ్యాలను, చారిత్రక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరముంది.

భారత రాజ్యాంగంలోని 324వ అధికరణ ప్రకారం దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణ బాధ్యత స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘానికి అప్పగించబడింది. ఓటరు జాబితాలను నిరంతరం నవీకరించడం, వాటి స్వచ్ఛతను కాపాడడం ఈ రాజ్యాంగబద్ధ సంస్థ ప్రాథమిక విధి. సాధారణంగా ప్రతి సంవత్సరం దేశంలో సంక్షిప్త సవరణ జరుగుతుంది. ఇందులో కేవలం కొత్తగా 18 ఏళ్లు నిండిన వారిని చేర్చడం, మరణించిన వారి వివరాలను తొలగించడం వంటి పరిమిత ప్రక్రియలు ఉంటాయి. కానీ, దేశంలో మారుతున్న జనాభారేటు, ఉపాధి కోసం సాగుతున్న అంతర్గత వలసలు, పట్టణీకరణ, సాంకేతిక మార్పుల వల్ల క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల్లో భారీ వ్యత్యాసాలు చోటుచేసు కుంటున్నాయి. ఒకే వ్యక్తి పేరు బహుళ నియోజకవర్గాల్లో లేదా ఒకే నియోజకవర్గంలో వివిధ బూత్లలో నమోదవడం వంటి 'ద్వంద్వ ఓట్ల' సమస్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోంది. ఈ క్రమరాహిత్యాలను శాశ్వతంగా నివారించేందుకు, సాధారణ సంక్షిప్త సవరణల కంటే భిన్నంగా, క్షేత్రస్థాయిలో లోతైన పరిశీలనతో కూడిన ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం తెరపైకి తెచ్చింది.

ప్రస్తుతం భారతదేశంలో నమోదిత ఓటర్ల సంఖ్య సుమారు 100 కోట్లకు పైగా ఉండి, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటరు గణాంక వ్యవస్థగా నిలిచింది. ప్రతి సార్వత్రిక ఎన్నికల చక్రంలో లక్షలాది మంది కొత్త ఓటర్లు ఈ జాబితాలోకి ప్రవేశిస్తుండగా, మరణాలు, శాశ్వత వలసల కారణంగా వేలాది మంది పేర్లను తొలగించాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2 నుండి 3 శాతం ఓట్లు సాంకేతిక లోపాలు, తప్పుడు చిరునామాలు లేదా నకిలీ గుర్తింపు కార్డుల కారణంగా దుర్వినియోగం అవుతున్నట్లు అంచనా. ఈ సమస్యను అధిగమించడానికి ఎన్నికల సంఘం ఆధార్ అనుసంధానం, డిజిటల్ బయోమెట్రిక్ ధ్రువీకరణ, కేంద్ర జనన-మరణ నమోదుల విభాగం సమాచార వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ, స్థానిక రెవెన్యూ యంత్రాంగం సాయంతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని భౌతికంగా సందర్శించి, ఓటర్ల సజీవ స్థితిని ధ్రువీకరించేలా రూపకల్పన చేశారు. పౌరుల నుంచి అభ్యంతరాలను, సూచనలను స్వీకరించడానికి ప్రత్యేక గడువులను ప్రకటించారు. ఇది పూర్తిగా నిష్పాక్షికమైన, చట్టబద్ధమైన పరిపాలనా ప్రక్రియ అని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేదని ఎన్నికల సంఘం వాదిస్తోంది. పారదర్శకతను నిరూపించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను, బూత్‌స్థాయి ఏజెంట్లను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి, సవరించిన డ్రాఫ్ట్ కాపీలను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తోంది.

కానీ, క్షేత్రస్థాయి వాస్తవాలు, ప్రతిపక్షాల ఆందోళనలు మరో కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ వంటి ప్రధాన జాతీయ, ప్రాంతీయ శక్తులు ఎస్ఐఆర్ తుది ఫలితాలపై తీవ్ర అపనమ్మకాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఇటువంటి భారీ ప్రక్షాళన చేపట్టడం వల్ల సమాజంలో వెనుకబడిన వర్గాలైన పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, సంచార జాతులు, పట్టణ మురికివాడల ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. నిరక్షరాస్యత, అవగాహనా లోపం కారణంగా వీరు నిర్ణీత సమయంలో అవసరమైన గుర్తింపు పత్రాలను సమర్పించలేరని, దీన్ని ఆసరాగా చేసుకుని అధికార పక్ష అనుకూల యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష ఓటు బ్యాంకును నిర్వీర్యం చేసే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. తగిన పత్రాలు లేవనే సాకుతో లక్షలాది మంది నిరుపేదల పేర్లను జాబితాల నుండి తొలగించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని ప్రతిపక్షాలు గళమెత్తు తున్నాయి.

ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై వస్తున్న విమర్శలు. గత కొన్నేళ్లుగా ఎన్నికల షెడ్యూళ్ల ఖరారు, ఎన్నికల నియమావళి అమలు, ఈవీఎంల పనితీరు, విపక్ష నాయకులపై చర్యల వంటి విషయాల్లో ఎన్నికల సంఘం తీరు అధికార పక్షానికి అనుకూలంగా ఉందనే ఆరోపణలు దేశంలో బలంగా వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కూడా రాజకీయ విశ్లేషకులు, పౌర సమాజం అనుమానపు దృక్పథంతోనే పరిశీలిస్తున్నాయి.

దీనికి భిన్నంగా అధికార పక్షమైన భారతీయ జనతా పార్టీ మరియు దాని మిత్రపక్షాలు ఈ సంస్కరణను గట్టిగా సమర్థిస్తున్నాయి. ఓటరు జాబితా స్వచ్ఛత అనేది పారదర్శక ప్రజాస్వామ్యానికి కనీస అవసరమని వారి వాదన. చనిపోయిన వారి పేరిట దొంగ ఓట్లు పడటం, సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు దేశీయ ఓటరు కార్డులు పొందడం, ఒకే ఓటరు వేర్వేరు నియోజక వర్గాల్లో ప్రభావం చూపడం వంటి అక్రమాలను అడ్డుకోకపోతే, నిజాయితీ గల పౌరుడి ఓటుకు విలువ లేకుండా పోతుందని అధికార పక్షం పేర్కొంటోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటరు జాబితాలను శుద్ధి చేయడం ద్వారా ఎన్నికల ఫలితాలపై దేశ ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని, దీన్ని రాజకీయం చేయడం తగదని వారు హితవు పలుకుతున్నారు.

భారత ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఓటరు జాబితాలపై వివాదాలు, ఆరోపణలు సరికొత్తవేమీ కావు. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు ఫోటో గుర్తింపు కార్డులను (ఎపిక్) ప్రవేశపెట్టి నప్పుడు కూడా ఇలాంటి రాజకీయ అభ్యంతరాలు, సవాళ్లు ఎదురయ్యాయి. కాలక్రమేణా డిజిటలైజేషన్ పెరిగినప్పటికీ లోపాలు పూర్తిగా సమసిపోలేదు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ, 2018 తెలంగాణ ఎన్నికల్లో లక్షలాది మంది ఓట్లు అకస్మాత్తుగా మాయమయ్యాయనే ఆరోపణలపైనా తీవ్ర దుమారం రేగింది. 2019 పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం కొన్ని నిర్దిష్ట వర్గాల ఓట్లను తొలగించారంటూ న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకవైపు వేలాది మంది అర్హుల పేర్లు జాబితాలో కనిపించకపోవడం ఎన్నికల వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు.

ఎన్నికల సంఘం తాజా నివేదికల ప్రకారం, ప్రతి శాస్త్రీయ సవరణ ప్రక్రియలో సగటున 1.5 నుండి 2 కోట్ల మంది కొత్త ఓటర్లు నమోదవుతుండగా, దాదాపు కోటికి పైగా అనర్హులైన లేదా మరణించిన వారి పేర్లు తొలగించబడుతున్నాయి. గతిశీలమైన భారత జనాభా రీత్యా ఈ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయడం ఏ ప్రభుత్వానికైనా, వ్యవస్థకైనా అసాధ్యం. అయితే, ఈ సాంకేతిక ప్రక్షాళన వేగంలో ఏ ఒక్క నిజమైన పౌరుడి ప్రాథమిక ఓటు హక్కు కూడా హరించుకుపోకూడదనే రాజ్యాంగ స్ఫూర్తిని మరువరాదు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఐదేళ్లకు ఒకసారి వేసే ముద్ర కాదు. అది పౌరుడి ఆత్మగౌరవానికి, దేశ సార్వభౌమాధికారంలో భాగస్వామ్యానికి ప్రతీక. అందువల్ల ఈ సవరణ ప్రక్రియలో అత్యంత అప్రమత్తత అవసరం.

చివరగా, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పవిత్ర సంస్కరణగా నిలుస్తుందా, లేక కేవలం రాజకీయ వివాదాల కేంద్రబిందువుగానే మిగిలి పోతుందా అనేది అది క్షేత్రస్థాయిలో అమలయ్యే తీరుపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే, ఎన్నికల సంఘం కేవలం పరిపాలనాపరమైన మొండితనంతో కాకుండా, సంపూర్ణ పారదర్శకతతో వ్యవహరించాలి. జాబితా నుండి ఏ ఒక్క పేరును తొలగించినా, అందుకు గల నిర్దిష్ట కారణాలను, ఆధారాలను బహిరంగపరచాలి.

అభ్యంతరాలు తెలపడానికి, తప్పులను సరిదిద్దుకోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పౌరులకు గడువును, తగినంత ప్రచారాన్ని విస్తృతంగా కల్పించాలి. కేవలం రాజకీయ పక్షాలపైనే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ ప్రతినిధుల పర్యవేక్షణను కూడా అనుమతించాలి. ఎన్నికల సంఘం యొక్క నిష్పాక్షికత, రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన సహకారం, ప్రజల అప్రమత్తత సమ్మిళితమైనప్పుడే ఓటరు జాబితాలు పవిత్రంగా, విశ్వసనీయంగా మారుతాయి. లేనిపక్షంలో, ప్రతి ఎన్నికల ముందు పునరావృతమయ్యే ఈ అనుమానాలు, ఆరోపణలు దేశ ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచే ప్రమాదముంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పిల్లలకు పుస్తకాల మోత!



రాష్ట్రంలో బడిగంట మోగింది. రెండు నెలల వేసవి సెలెవులనంతరం పాఠశాలలు పునప్రారంభం అయ్యాయి. పై చదువులు కొత్త పాఠ్యాంశాలకు పిల్లలు మానసికంగా సన్నద్ధం అవుతుంటే తల్లిదండ్రులు మాత్రం పెరిగే ఫీజులకు ఆర్థికంగా సన్నద్ధం కావాల్సి వస్తుంది. దీంతో పిల్లలకు పుస్తకాల మోత తల్లిదండ్రులకు ఫీజుల మోత మోగనుంది. పిల్లలకు కాసంత నాణ్యమైన విద్య అందించాలనే ఆశ తల్లిదండ్రులది. సమాజమనేది పెద్ద నుండి చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగుల నుండి పెద్ద, చిన్న ప్రైవేటు ఉద్యోగులు, శ్రమను నమ్ముకునే కార్మికుల మిళితం. వీరిలో ఒక్కరి అంతరాన్ని బట్టి ఆర్థిక స్తోమతను బట్టి పాఠశాలలు ఎంచుకునే పరిస్థితిలు ఉన్నాయి మన విధ్య విధానంలో. రాష్ట్రంలో సేవగా, ఉచితంగా అందాల్సిన విద్య వ్యాపారం ఐపోయింది.

తమ పిల్లలు ప్రయోజకులు కావాలన్న కాంక్ష ఏ తల్లిదండ్రులకైన ఉంటుంది. ఎన్ని కోట్లు సంపాదించిన ఉండని సంతృప్తి పిల్లలు ప్రయోజోకులైతే కలుగుతుంది. ఈ చిన్న జిజ్ఞాసే తల్లిదండ్రులను తనువు తాకట్టు పెట్టె అయిన తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే భావన కలుగా చేస్తుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రైవేటు విద్యలయాల ఫీజు నిర్ధారించే విధి విధానాలు లేవు. ఫీజులపైన నియంత్రణ లేదు.

ఏ పాఠశాలల ఫీజులకు వారే నిర్ణయాధినేతలు. కొన్ని పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచేస్తున్నాయి. ఈ విద్య సంవత్సరం ప్రైవేట్ విద్యా సంస్థలు ఏకంగా 35 నుండి 40 శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్రంలో ఐఐటి, ఈ టెక్నో, డిజి, ఇంటర్నేషనల్ ఇలా రకరకాలుగా ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయి. వీటిల్లో లక్షల్లో ఫీజులు. విద్య సంవత్సరం ఫీజు పక్కనపెడితే కేవలం అడ్మిషన్ ఫీజు అని వేలకు వేలు వసూలు చేస్తున్నారు. వీటితో పాటు పుస్తకాల ఖర్చు, యూనిఫాం ఖర్చు, బెల్ట్ టై, షు, స్కూల్ బస్ ఫీజు అని అదనంగా వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఎడతెరిపిలేని ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రుల జేబులు ఖాళీ అవుతున్నాయి అన్నది నిజం. కడుపున పుట్టిన బిడ్డలకు నాణ్యమైన విద్య అందించాలనే చిన్న స్వార్థం తల్లి దండ్రులను అప్పుల పాలు చేస్తుంది.

రాష్ట్రంలో కనీస మౌలిక సదుపాయాలు లేని విద్యాసంస్థలు చాలా ఉన్నాయి. పట్టణాలలో కనీస ఆట స్థలాలు లేని పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు విధ్య సంస్థల్లో అర్హత గల బోధన బోధనేతర సిబ్బందిపై పర్యవేక్షణ లేదు. పాఠశాలల పని వేళలా మీద ఖచ్చితమైన నిర్దేశాలు లేవు. కొన్ని పాఠశాలల ప్రారంభ సమయం పాఠశాల ముగింపు వేలలో పాఠశాలల తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. నిర్ణీత సమయం కంటే ఎక్కువ సమయం పాఠశాలలు ఉంచి పిల్లలకు మానసిక భారం మోపుతున్నారనడంలో సందేహం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక పాఠ్యాంశాలలో పాటు ప్రత్యేక తరగతులంటు అన్ని పుస్తకాలు పెన్నులతో నిండే బ్యాగుల బరువు మోయలేక కొందరి పిల్లల వెన్నుముక సైతం వంగిపోతుంది. సరియైన వెలుతురు లేని తరగతి గదులలో విద్యుత్ బల్బుల వెలుగులతో లేత కనులు దెబ్బతిని కళ్ళజోడు పెట్టుకోవాల్సిన వస్తుంది. కొన్ని పాఠశాలలు ర్యాంకుల కోసం పిల్లలను యాంత్రికంగా మారుస్తున్నారు. కేవలం కొన్ని పాఠశాలలు మాత్రమే తమ పారదర్శకత చాటుతూ తమ ఫీజుల వివరాలు, బోధన సిబ్బంది అర్హతలు, మౌలిక సదుపాయాలు బహిరంగంగా ప్రదర్శిస్తు పారదర్శకత చాటుతున్నాయి.

రాష్ట్రంలో తల్లిదండ్రులు చదువు కొనడంలో అలసిపోతున్నారన్నది నిజం. గత కొన్ని నెలల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థాన న్యాయమూర్తి రిక్షా వారి పిల్లలైనా, కోటీశ్వరుల పిల్లలైనా, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పిల్లలైనా ఒకే తరగతి గదిలో ఒకే బెంచిపై చదవాలని తీర్పు నిచ్చింది. కానీ దీని అమలు ఎక్కడ సాధ్యం కావడం లేదు. దీనికి కొంత ఊతమిచ్చే విద్య హక్కు చట్టం 2009 రాష్ట్రంలో అమల్లో లేదు.

కనీసం ప్రభుత్వాలైన ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టాలి. ర్యాంకుల కన్న పిల్లలో సృజనాత్మకత పెంచేలా పాఠశాలలను ప్రోత్సహించాలి. ఇటు పిల్లల్లో మానసిక బారం అటు తల్లిదండ్రులకు ఫీజుల ఆర్థిక బారం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

**- భైరబోయిన వెంకటేశ్వర్లు**

## పుట్టపర్తిలో జూన్ 19న మెగా జాబ్ మేళా



● **కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి, జూన్ 17 మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 19న పుట్టపర్తిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పుట్టపర్తి మండలంలోని బ్రాహ్మణపల్లి రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఈ జాబ్ మేళా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో దాదాపు 10 ప్రముఖ బహుళ జాతీయ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. రాక్స్ సెక్యూరిటీ సర్వీసెస్, కేవిల్ గ్రూప్, కియా ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్కాన్, సంగ్వా హైటెక్, కిమ్ఎల్, హ్యూందాయ్ మొబిస్, ఫైన్ టచ్, కేపిహెచ్ సంస్థలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ అర్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం అందనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 798 1541994 నంబర్ను సంప్రదించవచ్చని తెలిపారు

## ప్రజాసేవే లక్ష్యం..

● **జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**

**పుట్టపర్తి, జూన్ 17మనం న్యూస్:** ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు ట్రాఫిక్ పోలీసులు నిబద్ధతతో పనిచేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ సూచించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ విధుల నిర్వహణకు అవసరమైన పరికరాలను ట్రాఫిక్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిర్వహణ బాధ్యత అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. విధుల సమయంలో క్రమశిక్షణ పాటిస్తూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వ్యక్తిగత అవసరాల కోసం మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి ప్రజాసేవకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో, పాఠశాలలు మరియు కళాశాలల ప్రారంభం, ముగింపు వేళల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని చెప్పారు. పరిమిత సిబ్బందితోనూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సేవలను ఎస్పీ అభినందించారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీఆర్బీ సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి, ఆర్ఐ వలి మరియు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచానూరు అమ్మవారి ఆలయంలో వైభవంగా ఆర్జిత సేవలు

**తిరుపతి రూరల్ 17 మనం న్యూస్:** కలియుగంలో భక్తుల కోరికలను కరుణతో తీర్చే సిరుల తల్లి శ్రీ పద్మావతి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక ప్రశాంతత కలగాలని సంకల్పిస్తూ తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నిత్యం ఆర్జిత సేవలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం జరుగుతున్న ఈ సేవల్లో దేశ విదేశాల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతున్నారు.టీటీడీ ఆధ్వర్యంలో నిత్య, వారాంత, నెలవారీ, వార్షిక, శాశ్వత ఆర్జిత సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సమర్పించే ప్రతి సేవ భక్తులలో భక్తి భావనను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం ఉదయం 3.30 గంటలకుఈసేవజరుగుతుంది.ఉదయం 5 గంటలకు సహస్రనామార్చన నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు ఈ సేవ ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు కుంకుమార్చన సేవ నిర్వహిస్తారు.సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు సహస్ర దీపాలంకార సేవ జరుగుతుంది. ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం రాత్రి 9.45 గంటలకు ఈ సేవ ఉంటుంది. ఆలయంలోని వేదాశీర్వచన మండపంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వేదాశీర్వచనం కార్యక్రమం నిర్వహిస్తారు.ప్రతిరోజూ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వి.ఐ.పి. బ్రేక్ దర్శనం ఉంటుంది.ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహిస్తారు.

# రైతులంతా సార్వా సాగుకు సన్నద్ధం కావాలి

● **సూచనలు చేసిన ఎం ఏ ఓ నాగరాజు**




**ఆచంట జూన్ 17 మనం న్యూస్:** ఆచంట మండల పరిధిలో ని రైతులంతా సార్వాసాగుకు సన్నద్ధమై నారుమడులు వేసుకోవాలని స్థానిక మండల వ్యవసాయాధికారి బి నాగరాజు రైతులకు పలు సూచనలు చేశారు బుధవారం ఆచంట గ్రామంలో కేత్ బచావో అభియాన్... భూసారాన్ని పరిరక్షించండి అనే అంశంపై గ్రామసభ నిర్వహించారు ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులంతా సర్వసాగుకు సమాయత్తమై ఈనెల 20వ తేదీ లోపు తప్పనిసరిగా నారుమడులు పూర్తి చేసుకోవాలని అన్నారు రైతులు తప్పకుండా విత్తన శుద్ధి చేసుకోవాలని పలు సూచనలు చేశారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్టేరు ఏ డి ఆర్ వరి పరిశోధన స్థానం ఇంచార్జ్ డాక్టర్ సహదేవరెడ్డి మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వల్ల ప్రస్తుత సార్వా ఖరీఫ్ సీజన్లో తక్కువ వర్షపాతం ఉండే అవకాశం ఉందని రైతులంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు ఏ ఖరీఫ్ సీజన్లోనైనా కోతలు పూర్తయిన అనంతరం వరి మోడులకు నిప్పు పెట్టకుండా ఎకరాకు 100 కిలోల సూపర్ పాస్ పెట్ ఎరువును ఉపయోగించి కలియ దున్నుకోవడం ద్వారా భూమికి సేంద్రియ ఎరువు లభ్యం అవుతుందని వివరించారు మరో అతిథి పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు పి మురళీకృష్ణ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం పెంచాలని తద్వారా భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు సాధిస్తారని అన్నారు ఖరీఫ్ సీజన్ పూర్తయిన అనంతరం వేసవి పంటగా అపరాలు లేదా పచ్చిరొట్ట పైర్లు వేసుకుని నేలలో కలియ దున్నడంవల్ల సేంద్రీయ కార్బన్ శాతం భూమిలో పెరుగుతుందని వివరించారు ఏ పి ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా మాత్రమే రైతులకు యూరియా మరియు డిఏపి ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాలలో పట్టణమోదు చేయించుకోవాలని లేని ఎడల పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి గాని లేదా ఎరువులు విషయంలో కానీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అందువల్ల తప్పకుండా ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొక్క సుబ్రహ్మణ్యం సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆచంట గ్రామ రైతు సంఘం అధ్యక్షులు కూటమి ప్రభుత్వ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఫలించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి

**అనంతపురం, జూన్ 17 మనం న్యూస్:** రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి ఫలించింది. వెనుకబడిన ప్రాంతమైన రామగిరి మండలంలో విద్యార్థినులకు ఇక నుంచి ఇంటర్మీడియట్ స్థానికంగానే చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించారు. నసనకోట ఎంజేపీ బాలికల పాఠశాలను ఇంటర్మీడియట్ కు అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. రామగిరి ప్రాంతంలో చాలా ఏళ్లుగా పదవ తరగతి వరకు మాత్రమే విద్యార్థినులు చదువుకునే అవకాశం ఉండేది. రెసిడెన్షియల్ విద్య లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పదవ తరగతి తర్వాత చదువు మాన్పించే పరిస్థితి కనిపించేది. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే పరిటాల సునీత పరిటాల రవీంద్ర ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు అవకాశం కల్పించాలని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు పలు సార్లు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఆమె ఎంతో కృషి చేశారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు



ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం జీఓ నెం.6ను విడుదల చేసింది. జీ.ఓ ప్రకారం ఈ విద్యాసంత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. ఎంపీసీ-40, బైపిసి-40 సీట్లతో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచే ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరణ మొదలైంది. 10వ తరగతిలో 5వందలు ఆపై మార్కులు వచ్చిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నసనకోట ఎంజేపి బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ అన్నది ఈ ప్రాంత ప్రజల కల అని అన్నారు. ఇందుకోసం తాము చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. గతంలో విద్యార్థినులు 10వ తరగతి తర్వాత చదువు మానేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు స్థానికంగానే ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం వచ్చిందన్నారు. ఇప్పటికే ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు చదువుల్లో రాణిస్తున్నారని.. పదవ తరగతిలో కూడ మంత్రి మార్కులు సాధించారన్నారు. ఇంటర్మీడియట్ లో కూడా ఈ పాఠశాల రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండేలా చూడాలని అధ్యాపకులకు ఎమ్మెల్యే సునీత సూచించారు.

# జాతీయ స్విమ్మింగ్‌లో మెరిసిన కనాలిని,వర్షిక

జాతీయ వేదికపై 'బెజవాడ' జలసంచలనం!

జాతీయ పారా స్విమ్మింగ్‌లో విజయవాడ జలకన్యల చారిత్రక రికార్డు!

ఐజీ వి. సెంథిల్ కుమార్ (ఐ.పి.ఎస్) – విజయరాణి దంపతుల కుమార్తె 'కనాలిని'కి రజతం, కాంస్యం.. 'ప్రపంచ కప్' రేసుకు అర్హత!

చాణక్య – మాధవి దంపతుల కుమార్తె 'నూతంగి వర్షిక'కు మూడు పసిడి పతకాలు.. వ్యక్తిగత ఛాంపియన్షిప్ కైవసం!




**విజయవాడ స్పోర్ట్స్, జూన్ 17 (మనం ప్రతినిధి):** వైకల్యం అనేది శరీరానికే కానీ.. సాధించాలనే సంకల్పానికి కాదని నిరూపించారు బెజవాడ దివ్య కిరణాలు. శారీరక లోపాలను ఆత్మవిశ్వాసంతో ఎదురీదుతూ, జాతీయ వేదికపై జలసరిహద్దులను దాటి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో ఉన్న 'జీ స్విమ్ అకాడమీ'లో జూన్ 8 నుంచి 10 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన 26వ జూనియర్, సబ్-జూనియర్ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్షిప్స్‌లో మన విజయవాడ క్రీడాకారిణులు 'కనాలిని', 'నూతంగి వర్షిక' పతకాల పంట పండించారు. తమ అద్భుత ప్రదర్శనతో ఆంధ్రప్రదేశ్ కీర్తిని దేశవ్యాప్తంగా చాటిచెప్పారు.

**ప్రపంచ కప్ సమరానికి 'కనాలిని' రెడీ!**

జాతీయ పోటీల్లో వెటర్నరీ కాలనీకి చెందిన 15 ఏళ్ల కనాలిని ఆంధ్రప్రదేశ్ తరపున జలవిహారం చేసింది. నీటిలో దూసుకెళ్లిన వేగం చూసి క్రీడాలోకం అబ్బురపడేలా ప్రదర్శన ఇచ్చిన కనాలిని, ఎస్-10 విభాగంలో దేశవాళీ దిగ్గజాలకు గట్టి పోటీనిస్తూ 50 మీటర్ల ఫ్రీస్టైల్లో రజత పతకం, 100 మీటర్ల ఫ్రీస్టైల్లో కాంస్య పతకాన్ని ముద్దాడింది. ఈ టోర్నీలో ఆమె నమోదు చేసిన అత్యుత్తమ టైమింగ్స్ ఆధారంగా.. త్వరలో జరగబోయే అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ₹'పారా స్విమ్మింగ్ ప్రపంచ కప్ సిరీస్'₹కు కనాలిని అధికారికంగా ఎంపికైంది. కాకినాడ రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు సాధించిన ఈమె, మొన్నటికిమొన్న రాష్ట్ర స్థాయి పారా రైఫిల్ షూటింగ్‌లోనూ పసిడి పతకం సాధించి 'మల్టీ టాలెంటెడ్' అనిపించుకుంది. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఆంధ్రప్రదేశ్ పోలీస్ కోచ్ తులసి చైతన్య పర్యవేక్షణలో రాటుదేలిన కనాలిని.. 'పారా ఒలింపిక్స్‌లో దేశానికి పతకం తేవడమే నా అంతిమ లక్ష్యం' అని కనాలిని ధీమాగా వ్యక్తంచేసింది.

**ఒంటిచేత్తో 'వర్షిక' స్వర్ణ విహారం.. ఛాంపియన్షిప్ కైవసం!**

మరోవైపు సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీకి చెందిన 12 ఏళ్ల నూతంగి వర్షిక జాతీయ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించింది. వ్యాపారి చాణక్య, గృహిణి మాధవి దంపతుల కుమార్తె, కోచ్ లక్ష్మణరావు శిక్షణలో కేవలం ఎడమ చేత్తోనే ఈత కొడుతూ సంచలనాలు నమోదు చేస్తోంది.

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న ఈ చిన్నారి.. ఈ జాతీయ పోటీల్లో ఏకంగా 3 బంగారు పతకాలను కొల్లగొట్టడమే కాకుండా, సబ్జూనియర్ విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మక 'వ్యక్తిగత ఛాంపియన్షిప్' ట్రోఫీని గెలుచుకుని టోర్నీలోనే బెస్ట్ అథ్లెట్గా నిలిచింది. గతంలో ఏలూరు, కాకినాడ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఆరు బంగారు పతకాలు సాధించిన వర్షిక.. అంతర్జాతీయ వేదికలపై భారత్ తరపున మెడల్ సాధించడమే లక్ష్యంగా దూసుకుపోతోంది.

వైకల్యాన్ని జయించి, దేశవ్యాప్తంగా బెజవాడ పేరును మారుమోగించిన మన జలకన్యలు కనాలిని, వర్షికలకు 'మనం' పత్రికా యాజమాన్యం, క్రీడా విభాగం తరపున హార్దిక శుభాకాంక్షలు!

## రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ
# సుడిగాలి పర్యటన.ఏం ఏం నాయక్



**ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు /అరకు వ్యాలీ, జూన్ :17,** రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ప్రధాన కార్యదర్శి),ఎం ఏం నాయక్,ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ బుధవారం అరకు లోయ మండలం మాడగడ పంచాయతీలోని చంపాగూడ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని కాఫీ సెకండరీ నర్సరీ, బేబీ పల్పర్ మెషిన్, డ్రైయింగ్ యార్డులు (కాఫీ ఆరబెట్టే స్థలాలు), మరియు కాఫీ కన్సాలిడేషన్ ప్లాంటేషన్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాఫీ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన అధికారులు, రైతులతో మరియు సంబంధిత అధికారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ (ఌ), ఫీల్ కోఆర్డినేటర్ (ఊఇ), క్లస్టర్ లెవెల్ వర్కర్లు (ఇఔగిట) మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు. కాఫీ ఉత్పాదకతను పెంచేందుకు, రైతులకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు సిబ్బందిని ఆదేశించారు. డుంబిరిగుడ మండలంలో గల వీడివి కేంద్రాన్ని పరిశీలించి డిపిఎం మరియు ఏపీఎంతో మాట్లాడి మార్కెట్ లింకేజ్ వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలను చేశారు. అరకు వేలి గురుకులం, యూత్ ట్రైనింగ్ సెంటర్,స్పోర్ట్స్ స్కూల్ను పరిశీలించి స్కూల్ బాగోగులను గురుకులం ఓ ఎస్డిని, డి డి ట్రైబల్ వెల్ఫేర్ వారినిఅడిగి తెలుసుకున్నారు స్కూలు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పిల్లల వసతి సౌకర్యాలకు సంబంధించి ఓఎస్టీ గురుకులం,డిడి ట్రైబల్ వారికి వెల్ఫేర్ వారికి పలు సూచనలు చేశారు. అలాగే అరకు మ్యూజియం పరిశీలిస్తూ టికెట్ ధరలు టూరిస్టులు వచ్చినప్పుడు వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సంబంధిత అధికారులతో చర్చించి టూరిస్టులకు ఎటువంటి లోటు పార్టీ లేకుండా మ్యూజియం యొక్క ఆవశ్యకతలు వివరించి వారిని సంతోషపరిచి విధంగా మెలగాలని అధికారులకు సూచించారు.

# ఈనెల 19న రెండేళ్ల నమ్మకం



**విశాఖపట్నం: జూన్ 17 మనం న్యూస్** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా' రెండేళ్ల నమ్మకం ' సంక్షేమం అభివృద్ధి పేరుతో ఏయూ కన్వెన్షన్ లో ఈ నెల 19 న విజయోత్సవ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈ మేరకు బీచ్ రోడ్డు లోని ఏయు కన్వెన్షన్ సెంటర్లో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ , జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుతో కలిసి బుధవారం పరిశీలించారు. గత రెండు సంవత్సరాలలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో జరిగిన పారిశ్రామిక ప్రగతి, ఉద్యోగాల కల్పన, గూగుల్ డేటా సెంటర్ సీఐఐ సమ్మిట్,విశాఖ ఎకనామిక్ రీజియన్, భోగాపురం ఎయిర్పోర్ట్ కు రోడ్ల అనుసంధానం, సాఫ్ట్వేర్ కంపెనీలు ఏర్పాటు, తదితర అంశాలపై ఆడియో వీడియో ప్రజెంటేషన్ చేయడానికి వీలుగా ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు వేలమంది కి పైగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు కనుక అందుకు అనుగుణంగా సీటింగ్,డయాస్,మైక్ సిస్టమ్, త్రాగు నీరు, టాయిలెట్లు,పార్కింగ్, ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డీసీపీ విజయ మణికంఠ, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, డిప్యూటీ కలెక్టర్ రమణ, పి డి ఆర్ డి ఏ లక్ష్మీ పతి, డీఎస్ఓ భాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ఈనెల 21 న బీచ్ రోడ్ లోని కాళికా మాత ఆలయం వద్ద జరిగే యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు విస్తృత ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- **ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన**
- **వికాసం వైపు... కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి**
- **జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర**

**అనకాపల్లి, జూన్ 17 మనం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 98 విభిన్న అంశాలను వేడుకల థీమ్లుగా ప్రకటించగా, అనకాపల్లి జిల్లాకు 'ఫిషర్మెన్' (మత్స్యకారులు) థీమ్ను కేటాయించినందున బుధవారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నందు ఘనంగా వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ నుండి ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్,



శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, కే ఎస్ ఎన్ ఎస్ రాజు, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీ వేపాడచిరంజీవి రావు, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 12 సంవత్సరాల పరిపాలన పూర్తి చేసుకుందని తెలిపారు. రెండేళ్ల క్రితం ఇదే రోజున స్వర్ణాంధ్ర నిర్మాణానికి కూటమి ప్రభుత్వం గట్టి పునాది వేసిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, వికాసాల బాటలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా అగమ్యగోచరంగా ఉందని, ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షత, మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెన్నుదన్నుతో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే
# కూటమి ధ్యేయం



- **టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా**

**తాడేపల్లి జూన్ 17 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ రాష్ట్ర అభివద్ధికి విశేషంగా కషి చేస్తుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తాడేపల్లిలోని తమ క్యాంప్ కార్యాలయంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారు తమ సమస్యలు, వినతులను పల్లా దష్టికి తీసుకురాగా, వాటిని ఓపికగా విన్న ఆయన సంబంధిత అంశాలపై సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వాటి పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# రాగి రైతులకు భారీ ఊరట.. 600 బస్తాల కొనుగోలు



**పరిగి (మనం న్యూస్), జూన్ 17.** శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం పరిగి మండలం ఎర్రగుంట పంచాయతీ పరిధిలోని ఎర్రగుంట గ్రామ రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి సవితమ్మ ప్రత్యేక చొరవతో గ్రామంలో 600 బస్తాల రాగులను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేశారు. మార్కెట్లో ఎన్నడూ లేని విధంగా క్వింటాలుకు రూ.4,886 ధర లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రాగుల సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ఈ కొనుగోలు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించడం వల్ల ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని రైతులు పేర్కొన్నారు. గతంలో ధరల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కార్యక్రమం తమకు ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన సేవలే లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ హెచ్చరిక**



**అనంతపురం, కలెక్టరేట్ జూన్ 17: మనం న్యూస్:** ఆధార్ కేంద్రం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలే లక్ష్యంగా పారదర్శకంగా, వేగవంతంగా అన్నిరకాలసేవలుఅందించాలని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ సూచించారు. బుధవారం అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు చంద్రా హాస్పిటల్ పక్కన పి. ఆర్. రెసిడెన్సి భవనంలోనూతనంగాఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజలకు,వృద్ధులు ,మహిళలు విద్యార్థులకు మరియు గ్రామీణ ప్రాంతాల వారికి ఆధార్ సేవలను బాధ్యతా యుతంగా అందించాలని తెలిపారు. ఎవరైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాల తో నకిలీ ఆధార్నమోదుకుప్రయత్నించినప్పుడు అట్టివారిని గుర్తించి ఆ కేసులను తన దృష్టికి తీసుకురావాలని అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# చేసిన అభివృద్ధి ప్రజలకు వివరించాలి



- **పరిటాల శ్రీరామ్**

**ధర్మవరం అర్బన్, జూన్ 17 మనం న్యూస్:** రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకెళ్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంపై పెట్టుబడిదారుల విశ్వాసం పెరిగిందని, గత రెండేళ్లలో భారీ స్థాయిలో పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు 45 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# ఆక్వా రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించి, ఉత్తమ సాగు పద్ధతులు పాటించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు ఎగుమతి ప్రమాణాలను సాధించాలి

- **జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**పాలకొల్లు, జూన్ 17,మనం ప్రతినిధి :** ఆక్వా రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించి, ఉత్తమ సాగు పద్ధతులు పాటించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు ఎగుమతి ప్రమాణాలను సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం పాలకొల్లు ఎస్ ఎస్ కళ్యాణ మండపంలో ఆక్వా రైతుల కోసం ఫార్మ్ రిజిస్ట్రేషన్, ఫార్మ్ ఎన్రోల్మెంట్, విత్తనాల నాణ్యత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఆక్వా రంగం జిల్లాలో ముఖ్యమైన జీవనాధార రంగమని, రైతులు తమ చెరువులను తప్పనిసరిగా నమోదు చేసుకొని ప్రభుత్వ మార్గదర్శకాలనుపాటించాలని సూచించారు. ఫార్మ్ రిజిస్ట్రేషన్ మరియు ఎన్రోల్మెంట్ ద్వారా ట్రేసబిలిటీ, నాణ్యత ప్రమాణాల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. నాణ్యమైన హ్యాచరీల నుంచి మాత్రమే విత్తనాలు సేకరించి సాగు చేపట్టడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు.




సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ ఆనంద్ ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ కన్సల్టెంట్ ఖగ్గేశ్వరరావు ఫార్మ్ రిజిస్ట్రేషన్ విధానం, నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించారు. నేషనల్ సెంటర్ ఫర్ సస్టెనబుల్ ఆక్వాకల్చర్ ప్రతినిధి ఎస్.బాలాజీ సుస్థిర ఆక్వాకల్చర్ పద్ధతులు, రైతులు పాటించాల్సిన ఉత్తమ యాజమాన్య విధానాల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఓఎస్డీ ప్రొఫెసర్ టి.సుగుణ నాణ్యమైన విత్తనాల ఎంపిక, చెరువుల నిర్వహణ, వ్యాధి నివారణ చర్యలపై సాంకేతిక సూచనలు అందించారు.జిల్లా మత్స్యశాఖ అధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న సేవలు, నమోదు ప్రక్రియల గురించి వివరించారు. ఆక్వా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఆక్వా రైతులు, మత్స్య శాఖ అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి ని ఘనంగా సత్కరించారు.రైతులు అడిగిన సందేహాలకు నిపుణులు సమాధానాలు అందించారు.

# నిస్వార్థపరుడు పరవాడ ప్రసాద్



- **మాజీ ఉపముఖ్యమంత్రి బూడి**

**అనకాపల్లి చీడికాడ జూన్ 17 మనం న్యూస్ :** నిస్వార్థపరుడు కల్మషం లేని వ్యక్తి పరవాడ ప్రసాద్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండల కేంద్రానికి చెందిన పరవాడ ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసింది. బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో మాజీ ఎమ్మెల్యే ఎలమంచిలి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ కర్ణం ధర్మశ్రీ,దొండా రాంబాబు, మైచర్ల నానాజీ, ఎర్ర అప్పారావు. వైసీపీ చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్, మాజీ సర్పంచ్ నందారపు రమణబాబు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తగా కొనసాగుతూ అనేక మందికి అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించాలని, నిస్వార్థంతో ప్రజాసేవకు అంకితమయ్యే వ్యక్తి ప్రసాద్ అన్నారు. అటువంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరం అన్నారు. నా కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# నాడు మహిళా మంత్రులను తిట్టినప్పుడు ఏమైంది మీ సంస్కారం..?

- **డబ్బీరు ప్రశాంతి పట్నాయక్**



**తగరపువలస, మనం న్యూస్:** గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్సీపీ మహిళా మంత్రులను, మహిళా ప్రజా ప్రతినిధులను తెలుగుదేశం పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా బూతులు తిడుతూ, అసభ్య పదజాలంతో విరుచుకుపడినప్పుడు కూటమి నేతల సంస్కారం ఎటు పోయిందని భీమిలి నియోజకవర్గ వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ ప్రశ్నించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై హోం మంత్రి వంగలపూడి అనిత, ఇతర టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని, విమర్శలను ఆమె ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్న సమయంలో సభలోనూ, బయటా మహిళా ప్రజాప్రతినిధులపై టీడీపీ నేతలు చేసిన వ్యక్తిగత దాడులను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. నాడు టీడీపీ చేసిన దిగజారుడు రాజకీయాలు ఒప్పయితే, నేడు ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. గుడివాడ అమర్నాథ్ ఎక్కడా మహిళలను కించపరిచే విధంగా మాట్లాడలేదని, ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను, గతంలో కూటమి నేతలు చేసిన వ్యాఖ్యలను మాత్రమే ఆయన ప్రస్తావించారని స్పష్టం చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి దళిత కార్డ్, మహిళా కార్డ్ వాడుకుంటూ రాజకీయం చేయడం శోచనీయమన్నారు. గతంలో తమ పార్టీ నేతలు మహిళా ప్రజాప్రతినిధులపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలకు రాష్ట్ర మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ డిమాండ్ చేశారు.

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా'



**జి మాడుగుల.మనం న్యూస్. జూన్ 17,** కొత్తపల్లి జలపాతంలో జరుగుతున్న యోగ కార్యక్రమం వల్ల ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏం ఏం నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం జి మాడుగుల, మండలం కొత్తపల్లిలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా) కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలతో యోగా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎంఎం నాయక్ మాట్లాడుతూ ఈ యోగా కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, యువకులు విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసారని, వారి ఆరోగ్యం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు యోగాను అలవాటు చేయడం ద్వారా వారిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, మరియు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విధమైన కార్యక్రమాలను చక్కగా రూపకల్పన చేసినందుకు జిల్లా కలెక్టర్కు, జిల్లా యంత్రాంగానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# దళితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ అండగా ఉంటుంది

- **ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం**

**విశాఖపట్నం జూన్ 17 మనం న్యూస్:** విశాఖపట్నం జిల్లా గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఆధ్వర్యంలో దళితుల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దళిత ప్రజలు తమ భూ వివాదాలు, సామాజిక వివక్ష, సంక్షేమ పథకాల అమలులో జాప్యం, ఉపాధి, గృహాలు, పెన్షన్లు మరియు ఇతర సమస్యలను నేరుగా కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన రావాడ సీతారాం ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులను అక్కడికక్కడే వివరణ కోరుతూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితుల హక్కులకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోము. దళితులపై వివక్ష, అన్యాయం, వేధింపులు జరిగితే రాష్ట్ర ఎస్సీ కమిషన్ కఠినంగా స్పందిస్తుంది. బాధితులకు న్యాయం జరిగే వరకు కమిషన్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.



ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ సభ్యులను నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వైస్ చైర్మన్, మనం ఉత్తరాంధ్ర రీజినల్ బ్యూరో చీఫ్ తిలక్, మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా దుస్సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్ డి ఓ దిలీప్ చక్రవర్తి జోనల్ కమీషనర్ శేషాద్రి త్రినాధ్ ,సౌత్ ఏసీపీ వై. శ్రీనివాస రావు సీఐ గాజువాక నమ్మి గణేష్ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధి హామీ మస్టర్లను పరిశీలించిన ఎంపీడీఓ

**కాట్రేనికోన, జూన్ 17 మనం ప్రతినిధి:** కాట్రేనికోన మండలం దొంతికుర్రు, పల్లం గ్రామ పంచాయతీలో జరుగుతున్న వీబీజీ రామ్ జీ పనులను ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు .కొంతమంది ఉపాధిశ్రామికులకు వేతనం జాప్యం జరుగుతుందన్న విషయంపై తక్షణ చర్యలు చూపి వేతనం సమకూరే విధంగా చర్యలు చూపాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో మస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక చికిత్సకి సంబంధించిన కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. వడదెబ్బకు గురి కాకుండా ఉపాధి శ్రామికులు తగు జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

# ఓటర్లు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

**అమలాపురం, జూన్ 17(మనం న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించా రు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ ఇంటింటి సర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించారు ఈ సందర్భం గా ఆయన ప్రసంగిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయా లని ఆదేశించారు. జిల్లా లోని అన్ని నియోజకవర్గా ల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా సవరణ పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరా ల సేకరణకు సంబంధించిన ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియను వంద శాతం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు ప్రతి బి ఎల్ ఓ కు అవసరమైన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు ప్రతి బి ఎల్ ఓ తమకు కేటాయించిన భౌగోళిక పరిధి ప్రకారమే ఖచ్చితం




గా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు ఏ ఒక్క ఇల్లు లేదా అర్హుడైన ఓటరు వివరాలు విడి పోకుండా జాగ్రత్త వహిం చాలన్నారు సర్వే సమ యంలో మరణించిన వారి వివరాలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు అదే విధంగా కొత్తగా పెళ్లై వచ్చిన వారి వివ రాలు, ఇళ్లు మారిన వారి ఓట్ల బదిలీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసేలా బి ఎల్ ఓ లు చొరవ చూపాలన్నారు. ఓటర్ల జాబితాలో అస్ప ష్టంగా ఉన్న ఫోటో లను, తప్పుగా ముద్రితమై న వివ రాలను సరిచేసే ప్రక్రియను ఈ సర్వేలోనే పూర్తి చేయా లన్నారు.సర్వే ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని సిబ్బంది పనితీరు ను, ఎన్యూమ రేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవే క్షించాలని కలెక్టర్ స్పష్టం చేశా రు. ఎలాంటి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొం దించేందుకు అధికా రులు సమన్వయంతో పనిచే యా లని ఆయన పిలు పుని చ్చారు.ఈ సమీక్షా సమా వేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు సెక్షన్ సూప రింటెండెంట్ నాగలక్ష్మ మ్మ, వివిధ నియోజకవర్గాల ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓలు మరియు ఎన్నికల విభా గపు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు అలంకార చేపల పెంపకంపై శిక్షణ

**పిఠాపురం జూన్17(మనం న్యూస్) :** జిల్లా కలెక్టర్ శ్రీ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్, ఐఏఎస్ గారి ఆదేశాల మేరకు గ్రీన్ క్లైమేట్ ఫండ్ - భారతదేశ తీర ప్రాంత వాసులలో ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించడం జీసీఎఫ్-ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో, మత్స్యశాఖ, జిల్లా



గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) మరియు పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా) సంయుక్తంగా అలంకార చేపల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం మరియు మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్జీ) సభ్యుల సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో 80 మందికి పైగా ఎస్హెచ్జీ మహిళలు పాల్గొని అలంకార చేపల పెంపకానికి సంబంధించిన జాతుల ఎంపిక, సంతానోత్పత్తి పద్ధతులు, ఆహార నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ, వ్యాధి నియంత్రణ మరియు మార్కెటింగ్ అవకాశాలపై ప్రాయోగిక శిక్షణ పొందారు.ఈ కార్యక్రమంలో డా. ఎన్. శివరామ్, ప్రాజెక్ట్ డైరెక్టర్, పాడా, వి. కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, వి. కొండబాబు, డైరెక్టర్, అప్సడా; డా. జి. గోపి, సహాయ మత్స్యశాఖ సంచాలకులు, పి. వసంత మాధవి, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్, పాడా; ఎల్. శ్రీహర్ష, జిల్లా సమన్వయకర్త, జీసీఎఫ్-ఈసీఆర్ఐసీసీ; మత్స్య అభివృద్ధి అధికారులు కె. రామకృష్ణ మరియు పి. శ్రీ దత్తాత్రేయ; రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థకు చెందిన వి. నాగబాబు; అలాగే బి. మల్లేశ్వరరావు, ఏపీఎం పాల్గొన్నారు. తీర ప్రాంత సమాజాల్లో మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడం, వాతావరణ అనుకూల జీవనోపాధులను ప్రోత్సహించడం మరియు సుస్థిర మత్స్య ఆధారిత ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా జీసీఎఫ్-ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

# కొండేపూడికి వేమా నివాళి

**అమలాపురం, జూన్ 17: మనం న్యూస్:** అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండేపూడి సత్యనారాయణ మృతి పట్ల బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం నాడు ముమ్మిడివరం బొండాయికోడు వద్ద గల సత్యనారాయణ నివాసానికి వచ్చిన వేమా దివంగత జర్నలిస్ట్ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జర్నలిస్టుగా సమాజంలో అనేక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారం కోసం పోరాడిన సత్యనారాయణ జర్నలిస్ట్ ఉద్యమంలో సైతం కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులను వేమా పరామర్శించి ఓదార్చారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జగడం సత్యనారాయణ తదితరులు దివంగత జర్నలిస్ట్ సత్యనారాయణకు నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# వ్రతాల విభాగంలో దానాల వసూళ్ల వివాదం

- **పురోహితుడిపై చర్యలకు రంగం సిద్ధం?**

**అన్నవరం, జూన్ 17, మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానంలో నిత్యం నిర్వహించే సత్యదేవుని వ్రతాలకు విశేష ప్రాధాన్యత ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది దంపతులు స్వామివారి వ్రతాన్ని ఆచరించి ఆశీస్సులు పొందేందుకు అన్నవరం చేరుకుంటుంటారు. ముఖ్యంగా రూ.300 టికెట్తో నిర్వహించే సామూహిక వ్రతాలకు భారీగా భక్తులు హాజరవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్రతాలు నిర్వహించే సమయంలో కొందరు భక్తుల నుంచి దానాల పేరుతో అదనపు నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తాజాగా వివాదానికి దారితీశాయి. భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు మంతా



రాంబాబుపై దేవస్థానం అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం. అధికారికంగా నిర్ణయించిన టికెట్ రుసుముకు అదనంగా దానాలు ఇవ్వాలని సూచించడం, వాటిని స్వచ్ఛంద విరాళాలుగా కాకుండా ఒత్తిడి చేసే విధంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఈవో కార్యాలయ వర్గాలు కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. భక్తుల ఫిర్యాదులు నిజమని తేలితే సంబంధిత పురోహితుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దేవస్థానంలో భక్తులకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యమని, నిర్ణీత రుసుములకు మించి ఎలాంటి వసూళ్లకు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ అనంతరం మాత్రమే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువైన అన్నవరం దేవస్థానంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానం ప్రతిష్ఠను కాపాడటంతో పాటు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడు రోజులు జైలు శిక్ష

**పిఠాపురం జూన్17(మనం న్యూస్):** పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిఠాపురం నుండి సామర్లకోట రోడ్డులో పకురుద్దీన్ పాలెం సెంటర్ వద్ద యస్ ఐ షేక్ జాన్ భాష తన సిబ్బంది తో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి ఆటో నడుపుతున్న గడ్డం సుబ్రహ్మణ్యం అను వ్యక్తి పై కేసు నమోదు చేసి గౌరవ కోర్ట్ లో పెట్టగా ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం సెకండ్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ బొమ్మిడి భారతి తీర్పు చెప్పారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని పిఠాపురం రూరల్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు.

## ఉచిత యోగా తరగతులు

**పిఠాపురం జూన్17(మనం న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం -యోగాంధ్ర 2026 సందర్భంగా పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం, నూతన ఆశ్రమ ప్రాంగణంలో పీఠాధిపతి డా. ఉమర్ అలీషా స్వామి వారి అధ్యక్షతన, 18-6-26 గురువారం సాయంత్రం 4.30 గంటలకు, అంతర్జాతీయ యోగా కోచ్ శ్రీ కరిబండి రామకృష్ణ గారు ఉచిత యోగా శిక్షణ తరగతి నిర్వహించడం జరుగుతుంది. కావున శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలనుకునే ప్రతీ ఒక్కరూ వచ్చి, యోగా శిక్షణ లో పాల్గొని, పీఠాధిపతి డా. ఉమర్ అలీషా స్వామి వారి ఆశీస్సులు పొందవలసినదిగా పీఠం కన్వీనర్ శ్రీ పేరూరి సూరిబాబు తెలియ చేసారు.

# ప్రత్తిపాడు కూటమి ప్రభుత్వ విజయోత్సవ వేడుక వాయిదా ..!

**శంఖవరం జూన్ 17 మనం ప్రతినిధిః** అకాల వర్షం కారణంగా కాకినాడ జిల్లా నియోజకవర్గం కేంద్రం ప్రత్తిపాడులో నేడు నిర్వహించాల్సిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభ వాయిదా పడింది. అకాల వర్షాల నేపథ్యంలో సభా ప్రాంగణంలో నీరు నిల్వ ఉండటంతో సభను వాయిదా వేసామని, మరల ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలుపు తామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం సాయంత్రం ప్రకటించారు. ప్రతికూల ఆర్థిక పరిస్థితులు, సవాళ్లను అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్.డి.ఎ. ప్రభుత్వం గడచిన రెండేళ్లుగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్.డి.ఎ. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తైన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం



పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవ సభలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలోని నియోజకవర్గం కేంద్రం ప్రత్తిపాడులో జిల్లా స్థాయి విజయోత్సవ సభను నేడు (గురువారం) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జిల్లా స్థాయి వేడుకలను ప్రత్తిపాడులో 18 న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారికంగా ప్రకటించారు. ఈ వేడుకల సభను అన్నదాత సుఖీభవ - రైతులకు బాసట అనే ప్రత్యేక థీమ్ తో నిర్వహించేందుకు చేపట్ట వలసిన సన్నాహక చర్యలపై క్రింది స్థాయి అధికారులకు ఆదేశాలను కూడా జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పరిశీలించారు. అయితే అనంతరం అకాల వర్షం పడింది. సభా ప్రాంగణంలో నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో బాటు కాకినాడ జిల్లాకు వర్షాల రెడ్ అలెర్ట్ ను వాతావరణ శాఖ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానుల భద్రత దృష్ట్యా ఈ సభను తాత్కాలికంగా వాయిదా వేసామని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు గమనించి సహకరించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆ ప్రకటనలో కోరారు.

## జిల్లా ప్రజా రవాణా అధికారిగా బాధ్యతల స్వీకరణ

**అమలాపురం జూన్ 17 మనం న్యూస్ః** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీపీటిడి) డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా నియమితులైన జి. సత్యనారాయణ బుధవారం తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు విజయనగరం జిల్లాలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్ అండ్ కమర్షియల్)గా సేవలందించిన ఆయనకు రవాణా రంగంలో విశేష అనుభవం ఉంది. ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు, సంస్థ ఆదాయ వృద్ధి, సేవల నాణ్యత పెంపు, ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు.




## అన్నవరం దేవస్థానం లీజు వేలాలపై విమర్శలు



- **ఆదాయానికి గండి పడుతోందా?**
- **వేలం పాటల్లో సిండికేట్లుగా మారుతున్న లీజుదారులు**

**అన్నవరం, జూన్ 17, మనం న్యూస్:** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన షాపుల లీజు వేలంపాటలు వివాదానికి దారితీశాయి. కొండపై తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న ఒకటి నుంచి మూడు షాపులు, పడమర రాజగోపురం సమీపంలోని ఒకటి రెండు షాపులు, అలాగే ఆలయ ప్రాంగణంలో పూల దండలు, పువ్వులు విక్రయించే హక్కులకు సంబంధించి అధికారులు వేలం నిర్వహించారు. అయితే ఈ వేలాల్లో కొందరు లీజుదారులు పరస్పరం కుమ్మక్కై పోటీని తగ్గించడం ద్వారా దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న విమర్శల ప్రకారం, గతంలో లీజులు దక్కించుకొని దేవస్థానానికి చెల్లించాల్సిన లక్షలాది రూపాయల బకాయిలను చెల్లించకుండా ఎగవేసిన కొందరికి కూడా ఈసారి వేలంపాటల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బకాయిలు చెల్లించని వ్యక్తులను అనుమతించడం వల్ల నిజాయితీగా వ్యాపారం చేసే వారికి అన్యాయం జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేవస్థానం సి-సెక్షన్ పరిధిలో ఇప్పటికే లక్షలాది రూపాయల లీజు బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోకుండా మళ్లీ అదే వ్యక్తులకు అవకాశాలు ఇవ్వడం వల్ల దేవస్థానం ఆదాయం మరింత దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగిందా? పోటీ ధరలు వచ్చాయా? అనే అంశాలపై కూడా భక్తులు, స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. దేవస్థానం ఆస్తులు, లీజుల నిర్వహణలో పారదర్శకత పాటించడంతో పాటు బకాయిదారుల జాబితాను బహిర్గతం చేసి, బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికే భవిష్యత్తులో వేలాల్లో అవకాశం కల్పించాలని భక్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై దేవస్థానం అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## త్రాగునీరు లేక గ్రామాలు విలవిల

- **పశువులకూ చుక్క నీరు కరువు**
- **నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం పై మండిపడ్డ జెడ్పీటీసీ నేల కిషోర్**

**కాట్రేనికోన జూన్ 17 మనం ప్రతినిధిః** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండల పరిధిలో నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొబ్బర్లంక-పల్లంకుర్రు మెయిన్ ఛానల్ కు ఈ నెల 1వ తేదీన నీటిని విడుదల చేసిన అధికారులు కాలువల క్లోజర్ పనులు పూర్తికాకపోవడంతో మెయిన్ ఛానల్లో అడ్డుకట్టలు వేసి నీటి ప్రవాహాన్ని నిలిపివేశారు. దీంతో దిగువ గ్రామాల్లో త్రాగునీటి సమస్య తీవ్రంగా మారింది. ప్రజలతో పాటు పశువులకు సైతం తాగేందుకు చుక్క నీరు దొరకని పరిస్థితి నెలకొంది. పశువుల యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై కాట్రేనికోన మండల జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిని విడుదల చేసి పక్షం రోజులు గడిచిన తర్వాత కూడా అడ్డుకట్టలు వేసి నీటిని నిలిపివేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. నీటిపారుదల శాఖ అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ల అలసత్వంతో గ్రామీణ ప్రజలు, పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని విమర్శించారు. వెంటనే అడ్డుకట్టలు తొలగించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# భావితరాల భవిష్యత్తు, ఉన్నతమైన విద్య కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం




- **టీ డీపీ నేత పర్వత సురేష్**

**శంఖవరం జూన్ 17 మనం ప్రతినిధిః** భావితరాల భవిష్యత్తు, ఉన్నతమైన విద్య కు కూటమి ప్రభుత్వం విద్యార్థి మిత్ర కిట్ల' తో సహకారం అందిస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పర్వత సురేష్ అన్నారు. శంఖవరం మండలంలోని పీఎంశ్రీ శ్రీ పర్వత సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం తరపున ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్' పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మిశెట్టి జగ్గారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పర్వత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్య యొక్క విశిష్టతను, ప్రాధాన్యతను విద్యార్థులందరికీ అర్థమయ్యేలా వివరించారు. గతంలో చదువుకునే రోజుల్లో ఇలాంటి అత్యాధునిక సదుపాయాలు ఏవీ లేవని, నేడు ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు ఎన్నో మెరుగైన వసతులు అందుతున్నాయని గుర్తుచేశారు. లభించిన ఈ సువర్ణ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిస్తూ విద్యార్థులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్స్ పాల్ ఎ . వీర్రాజు,పాఠశాల చైర్మన్ దాసరి దేవి , మోడల్ స్కూల్ చైర్మన్ లక్ష్మి జ్యోతి , తెలుగుదేశం దేశం పార్టీ నాయకులు బుర్రావాసు, బుర్ర వరప్రసాద్, గ్రామంలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుర్రే వెంకటేశ్వరరావు ,కె బాలభాస్కర్ , మరియు కె.నాగేశ్వరరావు తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నవరం దేవస్థానం కళాశాల మైదానంలో
# మద్యం సీసాలు కలకలం

- **విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన**

**అన్నవరం, జూన్ 17, మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జూనియర్ కళాశాల మైదానంలో ఖాళీ మద్యం సీసాలు కనిపించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పవిత్ర పుణ్యక్షేత్ర పరిధిలో ఉన్న విద్యాసంస్థ ప్రాంగణంలో ఇటువంటి పరిస్థితులు నెలకొనడం పట్ల తల్లిదండ్రులు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల మైదానానికి సమీపంలోనే దేవస్థానం ఈవో బంగ్లా ఉండటంతో పాటు భద్రతా సిబ్బంది పర్యవేక్షణ కూడా ఉన్నప్పటికీ మద్యం సేవించి సీసాలను అక్కడే పడేస్తున్న ఘటనలు చోటుచేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు కళాశాల మైదానాన్ని మద్యం సేవించే కేంద్రంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు ప్రతిరోజూ వినియోగించే ప్రాంగణంలో మద్యం సీసాలు కనిపించడం ఆందోళనకరమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దేవస్థానం యాజమాన్యం, కళాశాల అధికారులు మరియు భద్రతా విభాగం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని మైదానంలో రాత్రి పూట పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణను



పెంచడంతో పాటు మద్యం సేవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పవిత్ర క్షేత్రంగా పేరుగాంచిన అన్నవరం దేవస్థానం పరిధిలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కళాశాల ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో రక్షిత ప్రాంతంగా మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడు

**ఆచంట జూన్ 17 మనం న్యూస్:** ఆచంట గ్రామపంచాయతీ పరిధిలో పై పోరా గ్రామానికి చెందిన కాండ్రేకుల రాంప్రసాద్ కుమారుడు అవినాష్ వయస్సు 14



సంవత్సరాలు ఈ బాలుడు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడు ఈ సమాచారం ఆ ప్రాంత జన సైనికుల ద్వారా జనసేన పార్టీ నాయకులు కొణిదల సత్యనారాయణ 20000 రూపాయలు మరియు నిత్యవసర సరుకులు తక్షణ సహాయంగా అనారోగ్య బాధిత కుటుంబానికి అందజేశారు అదేవిధంగా జనసేన నాయకులు లింగోలు రాఘవులు తమవంతుగా 5000 రూపాయలు అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి కుటుంబానికి అందించారు దీంతో బాలుడి కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎ క్కడి ప్రజలకైనా ఎలాంటి సమస్య తలెత్తిన పరిష్కరించేందుకు జనసేన పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో నంబూరు విజయ్ చెల్లింకల దుర్గాప్రసాద్ అప్పారి బాలాజీ తోరం ప్రసాద్ పోలిశెట్టి మణి బాబు శీలం అంజిబాబు వెంద్ర భాస్కర్తదితరులు పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు

## పాలకొల్లు మున్సిపల్ కమిషనర్గా
# కిరణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

**పాలకొల్లు, జూన్ 17,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పురపాలక సంఘం ఎఫ్ఎసి కమిషనర్ గా దొడ్డ కిరణ్ కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు టిడిపి నాయకులు, మా జి మున్సిపల్ కౌన్సిలర్లు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పొన్నూరి శ్రీనివాస్, ఢిఈ రాజకుమార్, సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్య లను పరిష్కరించి, పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు.



# ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మంత్రాలయం , జూన్, 17,మనం న్యూస్: ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఆర్డిఓ ఉపేంద్ర రెడ్డి , ఎంపీటీసీ బోయ వెంకటేష్ లు అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లోనిమంచాల గ్రామ పంచాయితీ నందు గల జెడ్పీ హెచ్ హై స్కూలు కి వెళ్ళే దారిలో స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని లేకుంటే దోమలు చేరి అనారోగ్యానికి గురవుతారన్నారు. అనంతరం రోడ్డు పై ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, మొదలగు వ్యర్థాలను తొలగించి స్వచ్ఛ షెడ్ కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రాలు మరియు శానిటేషన్ సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సీపీఐ వినతి

దేవనకొండ జూన్ 17( మనం న్యూస్ ): మండలంలో డివిస్టి హాస్టల్ ను పున: ప్రారంభించాలని, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కస్తూరిబా పాఠశాలకు సి.సి రహదారి ఏర్పాటు చేయాలని, ప్రాథమిక వైద్య కేంద్రం నందు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేయాలని రెగ్యులర్ ఫార్మాసిస్టు ని నియమించాలని అలాగే హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్-కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, చెల్లెల చెలిమల, పి. కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీరు మళ్లించాలని జిల్లా కలెక్టర్ డా..సిరి ని సిపిఐ మండల కార్యదర్శి ఎం నరసారావు కోరారు. బుధవారం దేవనకొండ మండలానికి



వచ్చిన జిల్లా కలెక్టర్ ను మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ పార్టీ మండల ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ మరియు ఫార్మసిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఖండప్ప, సిపిఐ మండల నాయకులు రవి, భాస్కర్, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, హరి, తిమ్మప్ప పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు ప్రాధాన్యత ఇవ్వండి



గూడూరు, జూన్ 17( మనం న్యూస్ ): భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని బిఎల్ఓ లందరూ ఈ కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని కోరారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పరిశీలించడానికి గూడూరు పట్టణంలోని పడకన వీధిలో పరిశీలించారు. బి ఎల్ ఓ చంద్రశేఖర్ ను ఎస్ ఐ ఆర్ గురించి పలు సూచనలు చేసి కార్యక్రమాన్ని పగడ్బందీగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల దగ్గర ఉన్న సమాచారాన్ని పూర్తిగా సేకరించి ఆధారాలను తీసుకొని నమోదు చేయాలని చెప్పారు. తాసిల్దార్ వెంట ఆర్ఐ సందీప్ నాయక్ పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలనలో... రాయదుర్గం ప్రగతి పథంలో



రాయదుర్గం జూన్ 15 మనం న్యూస్ః కల్యం గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల.డీ. హీరేహల్ మండలం కల్యం గ్రామంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు వివరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సహకారంతో, యువనేత నారా లోకేష్ గారి తోడ్పాటుతో రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ గత రెండేళ్లలో నియోజకవర్గానికి రూ.1267.44 కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. ఇందులో అభివృద్ధి పనులకు రూ.1025.22 కోట్లు, సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నికల హామీల అమలుకు రూ.240.22 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

# సర్ సర్వే గురించి ఎమ్మార్వోని అడిగి తెలుసుకున్న వైసీపీ నాయకులు



కౌతాళం,జూన్ 17 మనం న్యూస్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఇంటింటా సర్వే సందర్భంగా బిఎల్ఓ అధికారులు మరియు ఓటర్లుకు సంబంధించిన విషయాలును ఎమ్మార్వో ను అడిగి తెలుసుకున్న కౌతాళం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు, వైఎస్ఆర్సిపి మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు దేశాయి ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం నిర్వహించిన(సర్) ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల ఇంటింటా సర్వే గ్రామ బూత్ లెవెల్ అధికారులు మరియు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు బూత్ కన్వీనర్ లతో కలిసి ప్రతి ఓటర్ సమస్యలను విని పరిష్కారం చూపుతూ,దీని ద్వారా అక్రమ, డూప్లికేట్ ఓట్లను తొలగించి,అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా వైఎస్ఆర్సిపి కౌతాళం మండలం బుత్ కమిటీ సభ్యుల కు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఎ పి. వెంకటరామిరెడ్డి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, మాజీ సర్పంచ్ పాల్ దినకర్,ఎంక్రబ్రం రెడ్డి, రామస్వామి,నర్సిరెడ్డి, సక్రి శ్రీరామ్,ఖలీల్ మరియు వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్య పరిరక్షణకు దాణా



తుగ్గలి జూన్ 17(మనం న్యూస్ ): పశువుల ఆరోగ్య పరిరక్షణకు పోషకాలతో కూడిన ఈ దాణా అత్యంత ప్రాముఖ్యమని పశువైద్యాధికారి బాలకృష్ణ అన్నారు. జొన్నగిరి పశు వైద్యశాలలో పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణాను స్థానిక పశువుల బుధవారం పంపిణీ చేశారు. పశువైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ ఫండ్ లో తెల్ల రేషన్కార్డు కలిగిన పశు పోషకులు 50 కిలోల దాణా 1110 రూపాయలు ఉండగా 50 శాతం రాయితీ పోను రూ.555 రూపాయలు మాత్రమే పశుపోషకులు చెల్లించాలన్నారు. కిలో దాణా రూ.11 రూపాయలకు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు.మండలానికి 10 మెట్రిక్ టన్నులు దాణాను ప్రభుత్వం కేటాయించినట్టు అయన పేర్కొన్నారు. ప్రభుత్వం పశుపోషకుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ చేయూత నిస్తున్నట్టు ఆమె తెలిపారు.ఈ దాణాలో 25 శాతం మాంసకృత్తులు ఉంటాయని అయన పశు పోషకులకు వివరించారు.50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పశువుల దాణాను పశు పోషకులు సద్వినియోగపరుచుకోవాలని పశువైద్యాధికారి బాలకృష్ణ కోరారు.

# గుడివాడ అమర్నాథ్ బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలి



- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ఓడి చెరువు, జూన్ 17, మనం న్యూస్: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై వైకాపాకు చెందిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని రాష్ట్ర మహిళలందరికీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవిలో గౌరవ ప్రదమైన స్థానంలో ఉన్న ఒక రాష్ట్ర మహిళా హోం మంత్రిపైనే వైసీపీకి చెందిన మాజీ మంత్రి అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మీడియా కు ఓ ప్రకటన లో తెలిపారు. మహిళల గౌరవాన్ని కించపరిచేలా గౌరవప్రదమైన రాజ్యాంగం పదవిలో ఉన్న ఓ మహిళా హోం మంత్రి వంగలపూడి అనిత పై వైసిపికి చెందిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర తీవ్రంగా ఖండించారు. మహిళలను అవమానించేలా మాట్లాడడం ఏ మాత్రం మంచిదికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎవరు కూడా సమర్థించరని,దీనికి వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తక్షణం స్పందించి గుడివాడ అమర్ నాథ్ పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

# మారెన్న మృతి వాల్మీకి సంఘానికి తీరని లోటు

**రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వాల్మీకి బి లక్ష్మన్న.**



మంత్రాలయం ,జూన్ ,17,మనం న్యూస్ ;- నదిచాగి మారెన్న మృతి వాల్మీకి సంఘానికి తీరని లోటు అని రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు , మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ బి. లక్ష్మన్న అన్నారు. బుధవారం కౌతాళం మండలం నది చాగి గ్రామానికి చెందిన ఎస్ మారెన్న ( పోస్ట్ మారన్న ) ఉదయం గుండె పోటు తో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి వెళ్ళి జనసేన పార్టీ కోసిగి మండల అధ్యక్షులు సి వీరారెడ్డి, నది చాగి బసవరాజు, టీడీపీ నాయకులు పకీరప్ప మారెన్న మృతదేహానికి పూలవాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి లక్ష్మన్న మాట్లాడుతూ మారెన్న వాల్మీకి సంఘం స్థాపించినప్పటి నుంచి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు అని, సంఘానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ సంఘం తరపున మేము అండగా ఉంటామని లక్ష్మన్న తెలిపారు.

# ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య



మంత్రాలయం , జూన్ ,17,మనం న్యూస్ :- మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వగరూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రహిమాన్(40) మద్యానికి బానిస అయ్యాడు. దీంతో అప్పులు ఎక్కువ చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక , జీవితం పై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి ఉరివేసుకున్న వ్యక్తి ని కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సలీమా ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విజయోత్సవ సంబరాలు కాదు ఉద్యోగాలు కల్పించండి



కర్నూలు జూన్ 17మనం న్యూస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి అయిందని ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశామని కూటమి పాలకులు రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేస్తున్నారని అయితే వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందని విమర్శించారు విజయోత్సవ సంబరాలు కాదు ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారో చెప్పాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు ప్రశ్నించారు బుధవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కె శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి పాలకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు విజయవంతంగా అమలు చేశామని విజయోత్సవ సభలు పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన మండిపడ్డారు అవి విజయవత్సవ సభలు కాదని, రాష్ట్రంలో నిరుద్యోగులను వంచించిన సభలని ఆయన విమర్శించారు.నిరుద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో నిరుద్యోగుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాబిర్ భాషా, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, నగర నాయకులు అఖిల్, చంటి తదితరులు పాల్గొన్నారు

# ప్రాజెక్టులకు అడ్డుపడవద్దు

**టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి**




మంత్రాలయం , జూన్ 17,మనం న్యూస్ః రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాయలసీమ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకొని చెపడుతున్న ఆర్డియస్, వేదవతి,గుండ్రేవుల ప్రాజెక్టులకు అభివృద్ధికి కర్ణాటక , తెలంగాణ ప్రభుత్వాలు అడ్డుచెప్పవద్దని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. నిన్న ఆర్డి యస్ ప్రాజెక్టు పై కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కృష్ణ నది బోర్డు అధికారులు సమావేశం కావడం తో బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి స్పందిస్తూ మాట్లాడారు. రాయలసీమ కరువు ప్రాంతం ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్డియస్ , వేదవతి , గుండ్రేవులు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తూ ఉంటే అటు తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వం వారు ఆర్డి యస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టు లను అడ్డుకోవద్దన్నారు. మా కర్నూలు జిల్లా ప్రాంతం ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు ఒక్కసారి ఆలోచించించి మాకు సహకారించాలన్నారు.

# భక్తాదుల భద్రతే మా.. లక్ష్యం

నార్పల, జూన్ 17మనం న్యూస్: గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల భద్రతే లక్ష్యంగా పనిచేస్తామని, చట్టాన్ని అతిక్రమించి అల్లర్లు సృష్టించే ఆకతాయిలపై ఉక్కు పాదం మోపుతామని స్థానిక ఎస్త్సె సాగర్ తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం రోజున గూగూడు గ్రామాన్ని ఎస్త్సె సాగర్ తన సిబ్బందితో సందర్శించి భక్తాదుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తాదుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, భక్తాదులు ముఖ్యంగా మహిళలు చిన్నారుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతోందని.. డ్రోన్ల ద్వారా భక్తాదుల భద్రతను పర్యవేక్షించడం జరుగుతుందని ఎస్ఐ సాగర్ వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో ఆకతాయిలో అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా గూగూడు గ్రామం మొత్తం పోలీసుల పర్యవేక్షణలో ఉంటుందని, ప్రతి అడుగున పోలీసు పహారా .. నిఘా ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఆకతాయిలు జాగ్రత్తగా మసులుకోవాలని లేకుంటే చట్టం రుచి ఎంత తీవ్రంగా ఉంటుందో చూడాల్సి వస్తుందని ఘాటైన వ్యాఖ్యలు చేశారు ఎస్త్సె సాగర్. స్థానిక పోలీసులు కూడా ఈ సందర్భంలో పాల్గొన్నారు.

# ఉనికి కోసమే వైసీపీ నిరసనలు

- ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, జూన్ 17 మనం న్యూస్ః కూటమి రెండేళ్ల పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. ఉనికి కోసమే వైసీపీ నాయకులు నిరసనలు చేస్తున్నారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు అన్నారు. 3వ బుధవారం సందర్భంగా అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీధర్ చౌదరితో పాటు రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయ కమిటీ చైర్మన్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు. ఈనెల 19న నిర్వహించబోయే జిల్లా స్థాయి సమావేశం, గత రెండు బుధవారాల్లో జరిగిన సమావేశాల్లోని అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొదటి బుధవారం యూనిట్, రెండవ బుధవారం క్లస్టర్ ఇన్ ఛార్జిల సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. 3వ బుధవారం రోజు జరిగిన రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే అంశం గురించి చర్చించామన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే

గుత్తి , జూన్ 17 ( మనం న్యూస్ )ః కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుంతకల్లు పట్టణంలో బుధవారం విజయోత్సవ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీరప్ప సర్కిల్ నుంచి బలిజ కళ్యాణ మండపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా, అనంతరం బలిజ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణస్వామి, జనసేన నాయకుడు వాసగిరి మణికంఠ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా మాట్లాడిన గుమ్మనూరు జయరాం కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గుంతకల్లు ప్రాంతంలో రూ.30 కోట్లతో రహదారుల నిర్మాణం, గుత్తి మండలం మరియు పట్టణంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు శ్రీసత్యసాయి జిల్లా క్రీడాకారుల ప్రయాణం




పుట్టపర్తి, జూన్ 17 మనం న్యూస్ః విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో పాల్గొనేందుకు శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు బుధవారం ఉత్సాహంగా బయలుదేరారు. జిల్లా నుంచి ఎంపికైన 30 మంది క్రీడాకారులను అధికారులు అభినందిస్తూ, వారి ప్రయాణానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కిషోర్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ అర్చన, టూరిజం అధికారి ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి శ్రీసత్యసాయి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అధికారులు శుభాకాంక్షలు తెలియజేస్తూ విజయాలతో జిల్లాకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు

# హోంమంత్రి అనితపై వ్యాఖ్యలు ఖండనీయం

- మాజీ మంత్రి అమర్‌నాథ్‌పై పోలీసులకు ఫిర్యాదు



కొయ్యలగూడెం, జూన్ 17 (మనం ప్రతినిధి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్లో తెలుగు మహిళ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ ఆధ్వర్యంలో పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒక మహిళా మంత్రిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం మహిళా సమాజాన్ని కించపరిచే చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని,మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో చింతల వెంకటరమణ,కొత్త రమ,చెరుకూరి రమ్య,ఆరేటి వీరపండు,బొబ్బర రాజు,తిలక్ పాల్గొన్నారు.

# పరిశోధన పద్ధతి, ప్రచురణలపై కార్యశాల




నరసాపురం, జూన్ 17 (మనం న్యూస్) : స్థానిక వై.ఎన్. కళాశాలలో విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల కోసం పరిశోధన పద్ధతి మరియు పరిశోధన ప్రచురణలు అనే విషయంపై రెండురోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్.ఎ.స్ ఎన్ రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పరిశోధనా సమస్యను గుర్తించడం, డేటాను సేకరించడం మరియు విశ్లేషించడం ద్వారా కొత్త జ్ఞానాన్ని సృష్టించడానికి లేదా సిద్ధాంతాలను పరీక్షించడానికి సహాయపడుతుందని, పరిశోధన పద్ధతుల్లో పరిమాణాత్మక పద్ధతి, గుణాత్మక పద్ధతి, మిశ్రమ పద్ధతి అనే మూడు పద్ధతులు ఉంటాయని తెలిపారు. ఐదు ప్రాథమిక పరిశోధన దశలు పరిశోధన సమస్యలను నిర్వచించడం, ఆధారంగా చేసుకుని ఏ అంశంపై పరిశోధన చేస్తామో మొదటిగా తెలుసుకొని దానిని సమర్పించే విధంగా తయారుచేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు పోలిశెట్టి శ్రీ రఘురామారావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ్ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ గంధం శ్రీరామ కృష్ణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## కార్తిక్ ఆర్యన్ తో శార్వరి?

'మైవాపస్ ఆవుంగా'తో థియేటర్లలో సందడి చేస్తోంది బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపుతున్న ఈ భామ.. ఇప్పుడు మరో అవకాశాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. హిందీ హీరో కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో దర్శకుడు లవ్ రంజన్ ఓ సినిమాని తెరకెక్కిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలొస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో కార్తిక్ సరసన నటించేందుకు శార్వరీ వాఘ్ ను ఎంపిక చేసిందట చిత్రబృందం. యువతను ఆకట్టుకునే చిత్రాలను తెరకెక్కించిన లవ్ రంజన్ తో పనిచేయడానికి శార్వరి కూడా ఉత్సాహంగా ఉందని, ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది ఆఖర్లో చిత్రీకరణను ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

## జోడీ కట్టేదెవరు?

కథానాయకుడు రామ్ పోతినేని తన కొత్త సినిమా కోసం స్వయంగా మెగాఫోన్ చేతపట్టారు. ఈ నెలలోనే చిత్రీకరణ ప్రారంభమవుతోంది. రాపో సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమా స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్గా రూపొందనుంది. వీర అనే యువకుడి పాత్రలో సందడి చేయనున్నారు రామ్. ఆయన 23వ సినిమా ఇది. కొన్ని రోజులుగా కథానాయిక ఎంపికకు సంబంధించిన కసరత్తులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కయాదు లోహర్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఇదివరకు శ్రీనిధిశెట్టి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని డిసెంబరులో విడుదల చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు రామ్. త్వరలోనే కథానాయిక ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.



# రెండో వన్డేలో అఫ్గాన్ పై ఘన విజయం..

- భారత్ దే సిరీస్

అఫ్గానిస్థాన్ తో మూడు వన్డేల సిరీస్ ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది. లఖ్ నవూలో బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 170 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటైంది. లక్ష్యఛేదనలో అఫ్గాన్ 44.3 ఓవర్లలో 232/9 స్కోరుకు పరిమితమైంది. గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్గా మైదానాన్ని వీడిన దర్విష్ రసూలీ (6) తిరిగి బ్యాటింగ్కు రాలేదు. రహ్మత్ షా (79; 89 బంతుల్లో) చివరి వరకు పోరాడాడు. రహ్మానుల్లా గుర్బాజ్ (41), సెధికుల్లా అటల్ (42), ఇబ్రహీం జద్రాన్ (21) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ మూడేసి వికెట్లు పడగొట్టారు. అరంగేట్ర బౌలర్ ప్రిన్స్ యాదవ్ 2, వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీశారు. నామమాత్రపు మూడో వన్డే జూన్ 20న చెన్నైలో జరగనుంది.





MCRHRD లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఈషా సింగ్. ఇటీవల జరిగిన ISSF వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషా సింగ్ ని సత్కరించి అభినందించిన సీఎం.

# 77 పరుగులకే ఖేల్ ఖతం..

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తొలి మ్యాచ్ లో సౌతాఫ్రికా వుమెన్ను 65 పరుగుల తేడాతో చిత్తు చేసిన మొలినెక్స్ బృందం.. తాజాగా బంగ్లాదేశ్ మహిళా జట్టుపై కూడా ఘన విజయం సాధించింది.



లీడ్స్ వేదికగా హెడింగ్లీ మైదానంలో బుధవారం నాటి మ్యాచ్ లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్ కు దిగిన బంగ్లా టాపార్డర్ కుదేలైంది. ఆసీస్ పేసర్ కిమ్ గార్త్.. ఓపెనర్లలో దిలారా అక్తర్ ను డకౌట్ చేయడంతో పాటు.. జువేరియా ఫిర్దోస్ ను 8 పరుగులకే పెవిలియన్కు పంపింది.

వన్ డౌన్ బ్యాటర్ షర్మిన్ అక్తర్ (5)ను ఆసీస్ కెప్టెన్ సోఫీ మొలినెక్స్ వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. అనంతరం బంగ్లా సారథి నిగర్ సుల్తానా (27)ను కూడా మొలినెక్స్ బౌఆగిగా వెనక్కి పంపింది. ఇక మిగిలిన వారిలో శోభనా మొస్త్రీ (4), షోర్నా అక్తర్ (0) వికెట్లను ఎలిస్ పెర్రీ తన ఖాతాలో వేసుకోగా.. రీతూ మోనీ (16)ని జార్జియా వారేహామ్.. రెబెయా ఖాన్ (8)ను అన్నాబెల్ సదర్లాండ్ పెవిలియన్కు పంపారు.

ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో బంగ్లాదేశ్ మహిళా జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి కేవలం 77 పరుగులే చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా జట్టు కేవలం 9.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి పని పూర్తి చేసింది.

ఓపెనర్ జార్జియా వోల్ (32 బంతుల్లో 45)తో పాటు.. వన్ డౌన్ బ్యాటర్ ఎలిస్ పెర్రీ (15 బంతుల్లో 19) అజేయంగా నిలవగా.. మరో ఓపెనర్ బెత్ మూనీ (10) మాత్రం మరూఫా అక్తర్ బౌలింగ్ లో వెనుదిరిగింది. కాగా బంగ్లాపై విజయంతో గ్రూప్-'ఎ'లో ఆస్ట్రేలియా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఇప్పటికి ఆడిన రెండు మ్యాచ్ లలో గెలిచి నాలుగు పాయింట్లతో టాపర్ గా నిలిచింది.



## అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసి.. ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

ముక్కోణపు వన్డే సిరీస్ లో భారత్- 'ఎ' జట్టు తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడేసింది. దంబుల్లా వేదికగా అఫ్గానిస్తాన్- 'ఎ'తో బుధవారం నాటి మ్యాచ్ లో తిలక్ వర్మ సేన 101 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా నెట్ రన్ రేటు భారీగా మెరుగుపరుచుకుని ఫైనల్ చేరుకుంది.

## అభిమానిని కలిసి చలించిపోయిన పవన్

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక చిన్నారి వీడియో పవన్ కళ్యాణ్ హృదయాన్ని కదిలించింది. అరుదైన వ్యాధితో పోరాడుతూనే, తన అభిమాన నాయకుడిని ఒక్కసారైనా చూడాలని ఆశపడ్డాడు వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్. ఆ చిన్నారి కోరికను మన్నించిన పవన్.. ఏకంగా అతని ఇంటికే వెళ్లి సర్ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఈ కలయికకు సంబంధించిన ఎమోషనల్ దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారాయి. మంచంపై ఉన్న ఆ చిన్నారి చేయి పట్టుకుని పవన్ ఆప్యాయంగా పలకరించిన తీరు చూస్తుంటే ఎవరికైనా కంటతడి రాక మానదు. తన పర్యటన గురించి పవన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా నిరంజన్ చూపిస్తున్న అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో స్ఫూర్తినిచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇంతటి కష్టకాలంలోనూ ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వు చెదరలేదని, అతని మనోధైర్యం ప్రశంసనీయమని కొనియాడారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామితో పాటు, భద్రకాళి అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను అంటూ పవన్ రాసుకొచ్చారు. ఇదే సమయంలో తన హనుమకొండ పర్యటనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి కానిస్టేబుల్ వరకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలను జీవితాంతం గుండెల్లో దాచుకుంటానని పవన్ ఉద్వేగానికి లోనయ్యారు. ఒక స్టార్ హీరో, తన అభిమాని కోసం ఇంతలా పరితపించడం అభిమానులనే కాదు, సామాన్యులను సైతం ఆకట్టుకుంటోంది.

## మహేష్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్.. లైన్‌లో ఆ ఇద్దరు దర్శకులు!

సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పుడు డైరెక్ట్ ఇంటర్నేషనల్ సినిమాకి వెళుతున్న సంగతి తెలిసిందే. తన చరిష్మా లుక్స్ తో ఎప్పుడో తను ఇంటర్నేషనల్ లెవెల్ కటౌట్ అనిపించుకున్నారు. అయితే ఫైనల్ గా తన ఇంటర్నేషనల్ లెవెల్ ఎంట్రీ వారణాసి తో ఇప్పుడు జరగబోతుంది. ఇది తన కెరీర్ 29వ సినిమా కాగా ఇక దీని తర్వాతి బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అందులోని బెంచ్ మార్క్ నెంబర్ 30వ సినిమా కోసం ఇప్పుడు నుంచే డిస్కషన్ లు జరుగుతున్నాయి.



తన 30వ సినిమా కోసం సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అలాగే వరుస హిట్ సినిమాల దర్శకుడు బుచ్చిబాబు సానాలు ఫ్రంట్ రేస్ లో ఉంటే ఈ కాంబినేషన్ లలో ఏదో ఒకటి పక్కా కన్ఫర్మ్ అని తెలుస్తోంది. అంతే కాకుండా సందీప్ వంగా, మహేష్ కాంబినేషన్లో సినిమాకి ఓ టాలీవుడ్ టాప్ నిర్మాత కం డిస్ట్రిబ్యూటర్ అడ్వాన్స్ కూడా ఆల్రెడీ ఇచ్చేందుకు ముందుకొచ్చారని తెలుస్తోంది. సో ఇలా మహేష్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ కోసం ప్రస్తుతం సినీ వర్గాల్లో ఈ రచ్చ నడుస్తోంది.




## శర్వా సినిమాలో ప్రీతి ముకుందన్..?

ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. 'భోగి' షూటింగ్ పూర్తి కాగానే, శర్వానంద్ డైరెక్టర్ శ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ను పట్టాలెక్కించనున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకోగా, ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్కు 'జార్జ్ క్రిష్' అనే టైటిల్ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ క్రేజీ ప్రాజెక్ట్లో శర్వానంద్ సరసన నటించేందుకు యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ను హీరోయిన్గా సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో మంచు విష్ణు హీరోగా నటించిన 'కన్నప్ప' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి ప్రీతి అడుగుపెట్టింది. రీసెంట్గా 'బ్లాస్ట్' చిత్రంతో బాక్సాఫీస్ దగ్గర సందడి చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు శర్వా సరసన నటిస్తుందనే వార్త సినీ సర్కిల్స్లో జోరుగా చక్కర్లు కొడుతోంది.

ఇక ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మించనుండగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు నెలలో ప్రారంభం కానుంది. శర్వానంద్-శ్రీను వైట్ల కాంబినేషన్లో వస్తున్న ఈ ఎంటర్టైనర్ను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## విజయ్ దేవరకొండ రేర్ ఫీట్.. ఒకరు కాదు ఇద్దరు..!

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఆయన కెరీర్ లో ఒక రేర్ ఫీట్ సాధించి ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. ఒకరు కాదు ఇద్దరు గ్లోబల్ స్టార్స్ తో నటించే అరుదైన రికార్డు విజయ్ దేవరకొండ దక్కించుకున్నాడు. గతంలో 'లైగర్' చిత్రంలో బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్ ను ఇండియన్ సినిమాకు పరిచయం చేస్తూ, ఆయనతో కలిసి నటించే ఛాన్స్ దక్కించుకున్నాడు విజయ్. ఇక ఇప్పుడు ఆయన నటిస్తున్న 'రణబాలి' చిత్రంలో మరో ఇంటర్నేషనల్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూతో కలిసి నటించే అరుదైన అవకాశం దక్కించుకున్నాడు. 'ది మమ్మీ' సినిమాతో గ్లోబల్ స్థాయిలో మెప్పించిన ఆర్నాల్ వోస్లూని ఇప్పుడు రణబాలి చిత్రంతో ఇండియన్ సినిమాకు పరిచయం చేస్తున్నాడు. ఇలా ఒకరు కాదు.. ఏకంగా ఇద్దరు గ్లోబల్ స్టార్స్ తో నటించే అవకాశం దక్కించుకున్న హీరోగా విజయ్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు. ఇక రణబాలి సినిమాను దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ డైరెక్ట్ చేస్తుండగా రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది.



# వెంకీ-కళ్యాణ్ కాంబో మూవీ

### ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేసిన అనిల్ రావిపూడి

విక్టరీ వెంకటేష్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ సంక్రాంతి ఎంటర్ టైనర్ ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో నందమూరి కళ్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటంతో వెంకీ-కళ్యాణ్ రామ్ కాంబినేషన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి కథతో రాబోతున్నారా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

అయితే, ఈ ప్రెస్టీజియస్ సినిమాను అధికారికంగా పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ యొక్క గ్రాండ్ పూజా కార్యక్రమం ఈ రోజు ఉదయం 9 గంటల నుండి ఘనంగా జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో గతంలో వచ్చిన 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగను సృష్టించగా.. ఇప్పుడు కళ్యాణ్ రామ్ కూడా తోడవడంతో ఈ సంక్రాంతి ఎంటర్ టైనర్ నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక ఈ సినిమాకు జీ.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి ప్రొడ్యూస్ చేస్తున్నారు.

ఈ భారీ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ మరియు జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్టార్ కంపోజర్ జీ.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. పూజా కార్యక్రమంతో ఈ క్రేజీ మూవీ షూటింగ్ జర్నీ మొదలుకానుండగా, రేపు రాబోయే అప్ డేట్స్ కోసం ఇటు నందమూరి, అటు దగ్గుబాటి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.